ప్రజాశక్తి
గురువారం 28 మార్చి 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



భూములు పంచగ్రామాలవి... పెత్తనం దేవస్థానానిది....

- సుమారు లక్ష మంది బాధలు పట్టని వైసిపి, టిడిపి
- పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల కోసం మభ్యపెట్టేందుకు మళ్లీ 'సిద్ధం'

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

23ఏళ్లుగా పంచ గ్రామాలపై అధికార రాజకీయాలు నడుస్తున్నాయి. దశాబ్దాలుగా మాయ మాటలతో ప్రధాన పార్టీలు కాలయాపన చేస్తూ ఎన్నికలొస్తే మళ్లీ వచ్చి అవే మాటలు చెబుతున్నాయి. విశాఖపార్లమెంట్‌కు ఎన్నికలు వస్తుండడంతో ఈ ప్రాంత ప్రజలు 'పంచగ్రామాల' సమస్యను ఎలా పరిష్కరిస్తారు? అని ప్రధాన పార్టీల అభ్యర్థులను నిలదీయాల్సిన సమయం ఆసన్నమైందన్నది ఈ ప్రాంతంలో చర్చ జరుగుతోంది.

ఆనాటి నుంచీ దేవస్థానం హవా...

కమిటీలు, సమావేశాలు, చర్చలతోనే కాలం వెళ్లదీస్తూ చివరకు దేవస్థానం గుప్పెట్లోకి భూములు, హక్కులు వెళ్లిపోయేలాగ రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రధాన పార్టీలు పావులు కదపడంతో హక్కుదారులైన రైతులు, ప్రజలు ఈ 5 గ్రామాల్లో నానా అగచాట్లకు లోనవుతున్నారు. పంచగ్రామాలుగా పిలవబడే అడవివరం, పురుషోత్తపుం, చీమలాపల్లి, వేపగుంట, వెంకటాపురంలలో సుమారు లక్ష మందికి చెందిన భూ సమస్య ఇది. దేవస్థానం భూములు అని చెప్పుకోడానికి 1996 వరకూ ఎలాంటి హక్కులూ సింహాచలం దేవస్థానానికి లేవు. ఆ సంవత్సరం అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం దేవస్థానానికి జారీచేసిన రైత్వారీ పట్టాలతో భూములపై పెత్తనం చెలాయిస్తూ వస్తోంది. టిడిపి, నాటి కాంగ్రెస్, నేటి వైసిపి ఈ సమస్యను సరైన పద్ధతిలో పరిష్కరించకుండా జాప్యం చేస్తూ అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట లేనప్పుడు మరోమాట చెబుతూ పబ్బం గడుపుకుంటూ వస్తున్నాయి. సిపిఎం, వామపక్షాలు నిరంతరం పంచగ్రామాల సమస్యను విశాఖపట్నంలో ప్రధాన సమస్యగా అజెండాలో పెడుతూ పరిష్కారం కోసం పోరాడుతూ ఉన్నాయి.

రాజకీయాలతో నలుగుతున్న 'సింహాచల ప్రాంతం'

విశాఖపట్నం పార్లమెంట్‌కు ప్రధానంగా వైసిపి, టిడిపి బరిలో ఉన్నాయి. విశాఖ నగరపాలక సంస్థ (జివిఎంసి) పరిధిలోని 5 అసెంబ్లీ, పదిహేను వార్డులు కూడా ఈ గ్రామాల పరిధిలోనే ఉండడం విశేషం. విశాఖపట్నం, అనకాపల్లి పార్లమెంట్ పరిధిలోకి కూడా వస్తాయి. ప్రధానంగా విశాఖ పార్లమెంట్ నుంచి పోటీచేసే మిగతా 2లో..

ఓట్లు లేని బిజెపికి సీటు కేటాయింపు

గత ఎన్నికల్లో ఆ పార్టీకి నోటా కంటే తక్కువ ఓట్లు
సిఎం రమేష్ కోసం అనకాపల్లి ధారాదత్తం
టిడిపి ఎంపీ అభ్యర్థి లేకపోవడం ఇది తొలిసారి
అయ్యన్నకు పరోక్షంగా చెక్
చంద్రబాబు తీరుపై పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

టిడిపి ఆవిర్భావం తరువాత ఆ పార్టీ నుంచి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి పోటీలో లేకపోవడం ఇది మొదటసారి. పార్లమెంట్ నియోజకవర్గం ఏర్పడిన 1962 నుంచి 2019 వరకు 15 సార్లు ఎన్నికలు జరగ్గా, టిడిపి ఏర్పడిన తరువాత 1984 నుంచి జరిగిన పది ఎన్నికల్లోనూ ఆ పార్టీ అభ్యర్థులు బరిలో వున్నారు. పది ఎన్నికల్లో ఐదు సార్లు టిడిపి అభ్యర్థులు గెలుపొందారు. నాలుగుసార్లు కాంగ్రెస్, ఒకసారి వైసిపి అభ్యర్థి విజయం సాధించారు. ఈ ఫలితాలే టిడిపి బలాన్ని తెలియజేస్తున్నాయి. కానీ ఈ ఎన్నికల్లో టిడిపి అధినేత చంద్రబాబు అనకాపల్లి ఎంపీ స్థానాన్ని బిజెపికి వదిలిపెట్టారు. పార్టీలో సీనియర్ నాయకుడైన అయ్యన్నపాత్రుడుకు పరోక్షంగా ముకుతాడు వేసేందుకు, కడపకు చెందిన తనకు అత్యంత ఇష్టమైన బిజెపి రాజ్యసభ సభ్యుడు సిఎం రమేష్‌ను ఇక్కడ నుంచి పోటీలో పెట్టేందుకు టిడిపి, జనసేన, బిజెపి పొత్తులో ఈ స్థానాన్ని బిజెపికి చంద్రబాబు ధారాదత్తం చేశారు. అయ్యన్నపాత్రుడు తనయుడు విజయ్‌ను అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా పోటీలో పెట్టడం ఇష్టంలేని ఆయన పొత్తుల సర్దుబాటు పేర అయ్యన్నకు చెక్‌పెట్టి, బిజెపి నుంచి రమేష్‌ను రంగంలోకి దించేలా చేశారు.

1984 ఎన్నికల్లో పి.అప్పలనరసింహం టిడిపి ఎంపీగా బోనీ కొట్టారు. 1996లో అయ్యన్నపాత్రుడు, 1999లో గంట శ్రీనివాసరావు, 2004లో పప్పల చలపతిరావు, 2014లో ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఎంపీలుగా విజయం సాధించారు. బలమైన ఈ నియోజకవర్గాన్ని వదులుకొని, నియోజకవర్గమంతటా పిలిస్తే పలకడానికి మనిషిలేని బిజెపికి కేటాయించడాన్ని టిడిపి శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. 2019 ఎన్నికల్లో బిజెపికి నోటా కంటే తక్కువ ఓట్లు పడ్డాయి. అంత బలహీనంగావున్న పార్టీకి సీటు కేటాయించి, టిడిపికి జరగబోయే నష్టం భరించడానికి చంద్రబాబు సిద్ధపడ్డారు. 2019 ఎన్నికల్లో అనకాపల్లి బిజెపి ఎంపీ అభ్యర్థిగా పోటీచేసిన డాక్టర్ గండి వెంకట సత్యనారాయణకు 1.07 శాతం (13,276) ఓట్లు రాగా, నోటాకు 2.82 శాతం (34,897) ఓట్లు వచ్చాయి. గత మిగతా 2లో..

సార్వత్రిక ఎన్నికలను బహిష్కరిస్తాం : తాడి గ్రామస్తులు

వార్త 5లో..

ఫారం 7, 8 పెండింగ్ దరఖాస్తులను పరిష్కరిస్తాం

వార్త 2లో..

డంపింగ్ యార్డు తరలింపులో నిర్లక్ష్యం : సిపిఎం

వార్త 4లో..

దిష్టిబొమ్మల్లా శిలాఫలకాలు

వార్త 3లో..



విశాఖ పోర్టు అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం వద్ద ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న పద్మనాభరాజు

నూతన వేతన ఒప్పందంపై ఐపిఎ కుటిల వైఖరి

విశాఖ పోర్టు అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం వద్ద ధర్నా

వార్త మెయిన్ 2లో..

ఆర్‌ఓలు బాధ్యతగా వ్యవహరించాలి

జిల్లా ఎన్నికల అధికారి మల్లికార్జున

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రిటర్నింగ్ అధికారులది కీలకపాత్ర అని, ప్రతి ఆర్ఓ కూడా విధులను బాధ్యతగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ అధికారులు, పోస్టల్ బ్యాలెట్ బృందాలతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలు చేయాలన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలు, మార్గ దర్శకాలను తూ.చ తప్పక పాటించాలన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల ప్రాంగణాల్లోని వాణిజ్య స్థలాల్లో ఎటువంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, గోడపత్రికలు, బ్యానర్లను అనుమతించరాదని స్పష్టం చేశారు. జాతీయ రహదారి, ప్రధాన రహదారుల సమీపంలో ఇప్పటివరకు ఉన్న హోర్డింగులను సమాన ప్రాతిపదికన అన్ని రాజకీయ పార్టీలకు కేటాయించనున్నట్లు చెప్పారు. ఆర్‌ఒల దృష్టికి వచ్చిన గోడలపై ఉన్న రాజకీయ పక్షాల స్టిక్కర్లు, పోస్టర్లను తొలగించాలన్నారు. ఇంటిలోపల ఉన్న వాటిపై జోక్యం అవసరం లేదన్నారు. ఇంటి పైకప్పులపై యజమానుల అనుమతితో ఒక చిన్న బ్యానరు, జెండాను ఉంచవచ్చుని,దీనికి ఆర్ఓ అనుమతి తప్పనిసరి అని చెప్పారు. వివిధ ప్రాంగణాల్లో ఉన్న శిలాఫలకాలపై ఉన్న రాజకీయ నాయకుల పేర్లు, ఫొటోలను తొలగించాల్సిన అవసరం లేదన్నారు. రాజకీయాలకతీతంగా ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు నడుచుకోవాలని, విస్మరిస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏ వ్యక్తి వద్దా వస్తు రూపేణా రూ.10 వేలకు మించి ఉండరాదని, రూ.20 వేలకు మించి డొనేషన్స్ స్వీకరించరాదని, రూ.50 వేలకు మించి నగదు ఉండరాదని వివరించారు. వీటికి మించి ఉంటే సీజ్ చేయనున్నట్లు తెలిపారు. డ్రగ్స్, మద్యం, నగదు, ఆభరణాలు, వస్త్రాలు, ఇతర వస్తుసామాగ్రి సీజర్స్ కిందకు వస్తాయని, వాటిని పరిశీలించి సీజ్ చేయాలన్నారు.

జిల్లాలో సి-విజిల్ బాగా పనిచేస్తుందన్నారు. రాజకీయ మిగతా 2లో..



సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి మల్లికార్జున

మొదటి పేజీ తరువాయి..

భూములు పంచగ్రామాలవి.. పెత్తనం దేవస్థానానిది...

అభ్యర్థులు వైసిపి నుంచి బొత్స ఝాన్సీ, టిడిపి అభ్యర్థి భరత్ ఏనాడూ పంచ గ్రామాల భూ సమస్య ఉందన్న విషయాన్ని గుర్తెరగరన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్న కుల, ధన రాజకీయాల్లో భాగంగా ఓటర్లను ఎన్ని రకాలుగా ప్రలోభాలకు గురిచేసి గెలవాలన్న తాపత్రయం ప్రధాన పార్టీల్లో వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఏళ్లతరబడి లక్ష మంది రైతులు, వారి కుటుంబాలు ఎదుర్కొనే ఈ సమస్యకు పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి. 1996లో విశాఖ గ్రామీణ తహశీల్దార్ ద్వారా నాటి తెలుగుదేశం ముఖ్యమంత్రి చంద్రబాబు 12వేల ఎకరాలు సింహాచలం దేవస్థానానికి చెందుతాయంటూ రైత్వారీ పట్టాలు ఇచ్చేయడంతో సమస్య రాజుకుంది. ఆ నాటి నుంచీ ఈనాటి వరకూ కనీసం ఇళ్ల రిపేర్లు, స్థలాల్లో కొత్త ఇల్లు నిర్మాణం కోసం కూడా ప్రభుత్వాలు అనుమతి ఇవ్వడం లేదు. ఒకవేళ ప్రభుత్వం అనుమతి ఇచ్చినా దేవస్థానం అధికారులు కర్రపెత్తనంతో ఎక్కడకక్కడ పనులు చేపట్టనీయడంలేదు. దీంతో భూముల బదలాయింపు, అమ్మకాలు, కొనుగోలు వ్యవహారాలేవీ జరగక పోవడంతో ఎలాంటి అభివృద్ధికి నోచుకోక సింహాచలం దేవస్థానం పరిధిలో పలు గ్రామాలపై నీలినీడలు అలముకున్నాయి.

హక్కుదారులను గుర్తించడం ఎలా?

దేవస్థానం కొండపై గుడి లేని నాటి నుంచీ సింహాచలం గ్రామం ఉండేదని పూర్వీకులు చెబుతున్నారు. అలాంటప్పుడు ఈ భూములపై దేవస్థానం పెత్తనం ఏమిటి? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. విజయనగరం మహారాజుల నుంచి దఖలు పడినట్టు ఎలాంటి ఆధారం కూడా దేవస్థానం వద్ద లేదు. గతంలో 1996 సంవత్సరానికి ముందు ఏనాడూ దేవస్థానం అభియోగానికి ఆధారాలు కోర్టుల్లో చూపలేకపోవడం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. అంతేగాక 1903 నాటి గిల్‌మెన్ సర్వే రికార్డుల ఆధారంగా హక్కుదారులను గుర్తించాలన్న డిమాండ్ పంచగ్రామాల ప్రజా, రైతు సంక్షేమ సంఘం చేస్తూ వస్తోంది. 1996-97లో టిడిపి ప్రభుత్వ హయాంలో జారీచేసిన పట్టాలను తక్షణం రద్దుచేయాలన్న డిమాండ్ కూడా ఈ సంఘం నుంచి వినిపిస్తోంది.

100 రోజుల్లో పరిష్కారం అన్న వైసిపి చతికిల పడింది...

తాము అధికారంలోకి వస్తే 100 రోజుల్లో సింహాచలం పంచగ్రామాల సమస్యకు పరిష్కారం చూపుతామంటూ వైసిపి అధినేత జగన్ చేసిన ప్రసంగాలు ఆచరణకు నోచుకోలేదు. కమిటీలు వేయడం, అందులో సభ్యులను, మంత్రులను మార్చడంతోనే కాలం అయిపోయింది. 2024 ఎన్నికలు మళ్లీ రానే వచ్చాయి. కథ మళ్లీ మొదటకే వచ్చింది. సమస్యను సృష్టించిన తెలుగుదేశం పార్టీ పరిష్కరిస్తానని ఇప్పుడు వాగ్దానం (ఓట్ల రాజకీయం) ప్రారంభించింది. గతంలోనూ ఎన్నికల ముందు జీవోలిచ్చి మాయ చేసింది. సమస్యను చూడకుండా ఓట్లను మాత్రమే చూడడంతో ఈ సమస్య పరిష్కారం కాకుండా పోతోంది. కోర్టుల్లో పంచగ్రామాల సమస్యపై పలు కేసులు పడడంతో యధాతథస్థితి కొనసాగించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ ఆర్డర్లను డిస్మిస్ చేసే రాజకీయం పంచగ్రామాలకు అవసరం. కానీ ప్రధానపార్టీలేవీ ముందుకు రావడం లేదు.

ఓట్లు లేని బిజెపికి సీటు కేటాయింపు

ఎన్నికల్లో గెలిచిన వైసిపి అభ్యర్థి డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతికి 47.33 శాతం (5,86,226) ఓట్లు రాగా, టిడిపి అభ్యర్థి ఆడారి ఆనందకుమార్‌కు 40.13 శాతం (4,97,034) ఓట్లు వచ్చాయి. 40.13 శాతం ఓట్లు వచ్చిన టిడిపి తమ పార్టీ నుంచి అభ్యర్థిని బరిలో నిలపకుండా, సిఎం రమేష్ కోసం కేవలం 1.07 శాతం ఓట్లు వచ్చిన బిజెపికి ఈ నియోజకవర్గం చంద్రబాబు వదిలేశారని నాయకులు, కార్యకర్తలు అంటున్నారు.

ఆర్‌ఒలు బాధ్యతగా వ్యవహరించాలి

పక్షాలు నిర్వహించే సభలు, ర్యాలీలు ఇతర కార్యక్రమాల నిర్వహణ కోసం సి-విజిల్ యాప్ నందు దరఖాస్తు చేసుకున్న వాటిని పరిశీలించి అనుమతులు మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని ఆర్‌ఒలను ఆదేశించారు. జిల్లా పరిధిలోని ప్రతి పోలింగ్ స్టేషన్లలో అవసరమైన అన్ని మౌలిక వసతులు ఉండేలా ఆర్‌ఒలు సరిచేసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా మరుగుదొడ్లు, ర్యాంపులు, తాగునీరు తదితర వాటిపై దృష్టి సారించాలన్నారు. ఏప్రిల్ 14వ తేదీ వరకు ఫారం -6 దరఖాస్తులను స్వీకరించ వచ్చని, మీ వద్ద ఇప్పటికే పెండింగు ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై జివిఎంసి అదనపు కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో ఎంసిసి జిల్లా నోడల్ అధికారి, జివిఎంసి కమిషనర్ సిఎం. సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవిన్యూ అధికారి కె.మోహన్ కుమార్, రిటర్నింగ్ అధికారులు హుస్సేన్ సాహెబ్, ఎస్.భాస్కర రెడ్డి, శేష శైలజ, లక్ష్మారెడ్డి, అఖిల, మూర్తి, పోస్టల్ బ్యాలెట్ బృందాలు,ఇతర ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫారం 7, 8 పెండింగ్ దరఖాస్తులను పరిష్కరిస్తాం

జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి మల్లికార్జున

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఓటర్ల జాబితాలో కొత్తగా ఓట్లు నమోదుచేయాలని, జాబితాలో ఉన్న తమ ఓట్లను తాము నివసిస్తున్న కొత్త చిరునామాలోకి మార్చాలని కోరుతూ వచ్చిన ఫారం 7, 8 దరఖాస్తులు 52 పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో 38 ఇతర రాష్ట్రాలకు చెందిన ఫారం 8 ఉన్నట్లు, వీటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన ఆదేశాలపై జిల్లా కలెక్టర్ మల్లికార్జున బదులిస్తూ, సీజర్స్‌పై గట్టి నిఘా ఏర్పాటుచేసి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఎంసిసి, ఫ్లయింగ్ స్క్వాడ్స్, పోలీసు బృందాలతో నిఘాను పటిష్టం చేసినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని చెక్కు పోస్టుల వద్ద ప్రత్యేక బృందాలను అప్రమత్తం చేశామని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంసిసి జిల్లా నోడల్ అధికారి, జివిఎంసి కమిషనర్ సీఎం సాయి కాయంత్ వర్మ, అదనపు కమిషనర్ కెఎస్.విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్, జిల్లా రెవిన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, రిటర్నింగ్ అధికారులు హుస్సేన్ సాహెబ్, ఎస్.భాస్కరరెడ్డి, శేషశైలజ, లక్ష్మారెడ్డి, అఖిలమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'దక్షిణం'లో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గ నుంచి వైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న వాసుపల్లి గణేష్ కుమార్ బుధవారం పూర్ణా మార్కెట్ వద్ద ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో పూజ నిర్వహించి ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి హాజరై మాట్లాడారు. రాష్ట్రాన్ని నాశనం చేసిన టిడిపి, బిజెపి, జనసేన కూటమిని రానున్న ఎన్నికల్లో ఓడించాలని కోరారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, బిజెపిలు కూటమి పేరుతో వైసిపిపై దాడి చేయడానికి వస్తున్నారన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇక్కడి నుంచే పాలన చేస్తారని తెలిపారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకించి, ముందుగా పోరాటానికి మద్దతు ఇచ్చిన పార్టీ వైసిపి అని గుర్తు చేశారు. ప్రజల శ్రేయస్సు, సంక్షేమానికి పథకాలను రూపొందించి నేరుగా ప్రజల ఖాతాల్లోకి జగన్మోహన్‌రెడ్డి చేర్చుతున్నారని తెలిపారు. దక్షిణంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌ను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ దక్షిణంలో మునుపెన్నడూ లేని అభివృద్ధి జరిగిందన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ

ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ మాట్లాడుతూ, మహిళలకు, బిసిలకు, మైనార్టీలకు సముచిత స్థానం కల్పించిన జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, వైసిపి జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, నాయకులు జాన్ వెస్లీ, కొండా రాజీవ్‌గాంధీ, ద్రోణంరాజు శ్రీవాత్సవ్, డాక్టర్ జహీర్ అహ్మద్, గరికిన గౌరి, తోట పద్మావతి, కోడిగుడ్ల పూర్ణిమ, చెన్నా జానకిరామ్, మాసిపోగు మేరి జోన్స్, కోడూరు అప్పల రత్నం తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి క్లియరెన్స్ సేల్ ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జగదాంబ జంక్షన్‌లోని లేపాక్షి ఎంపోరియంలో క్లియరెన్స్ సేల్ బుధవారం ప్రారంభమైంది. ఈ నెల 31వ తేదీతో ఈ సేల్ ముగుస్తుందని లేపాక్షి విశాఖ నగర బ్రాంచి మేనేజర్ ఎ.కార్తీక్ తెలిపారు. తయారుచేసిన హస్త కళా వస్తువులను ఈ ఎగ్జిబిషన్‌లో తయారీదారులే నేరుగా విక్రయిస్తారన్నారు. ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, కలంకారి, వైట్వుడ్, ఏలూరు కార్పెట్లు, బంజారా -క్రోచెట్ లెస్, రోజ్ వుడ్ బొమ్మలు, వెల్వెట్ కార్పెట్స్, లెదర్ పప్పెట్రీ, వైట్ వుడ్ బర్డ్స్, లెదర్ లాంప్ షేడ్స్, ఎపి వుడ్ కార్వింగ్స్, స్టోన్ కార్వింగ్, చేనేత వస్త్రాలు, చీరలు, డ్రెస్ మెటీరియల్, నారాయణపేట చీరలు, కలంకారి, పోచంపల్లి, కాశ్మీరి షాల్స్ తదితరాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. 10 నుంచి 40 శాతం వరకు డిస్కౌంట్ సదుపాయం ఉందని, నగర వాసులు, పర్యాటకులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐసిఐసిఐ ప్రూ గ్యారంటీడ్ పెన్షన్ ప్లాన్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఐసిఐసిఐ ప్రూ గ్యారంటీడ్ పెన్షన్ ప్లాన్ ప్రజలకు అందుబాటులో ఉందని ఐసిఐసిఐ ప్రూ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రాంతీయ మేనేజర్ శ్రీకాంత్ మండపాక తెలిపారు. సిరిపురంలోని సంస్థ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, ప్రస్తుత 7 శాతం వడ్డీ రేటు, యాన్యుటీ ప్రోడక్ట్‌లో తమ పెట్టుబడిని లాక్-ఇన్ చేసుకునే అవకాశాన్ని సంస్థ కల్పిస్తోందని వివరించారు. జీవిత బీమా కంపెనీలు అందించే పెన్షన్ లేదా యాన్యుటీ ఉత్పత్తులు గ్యారెంటీగా స్థిరమైన జీవితకాల ఆదాయాన్ని అందిస్తాయని తెలిపారు. కొనుగోలు సమయంలో వడ్డీ రేటు లాక్-ఇన్ చేయటం ద్వారా ఉద్యోగ విరమణ పొందినవారు వడ్డీ రేటు ఒడిదుడుకుల వల్ల ప్రభావితం కాని స్థిరమైన ఆదాయాన్ని పొందుతారని వివరించారు.

మెడికవర్‌లో ఊపిరితిత్తులకు అరుదైన చికిత్స

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్ర రాష్ట్రంలోనే తొలిసారిగా విశాఖపట్నం వెంకోజిపాలెంలోని మెడికవర్ హాస్పిటల్‌లో పల్మోనాలజీ వైద్యులు ఊపిరితిత్తులకు అరుదైన "డీప్ క్లీనింగ్ లంగ్ వాష్" చేసి రోగి ప్రాణాలను కాపాడినట్లు డాక్టర్ ప్రేమ్‌కుమార్, డాక్టర్ సుధీర్ తలే తెలిపారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన 43 ఏళ్ల మహిళ ఆయాసం, రక్తంలో ఆక్సిజన్ శాతం తక్కువతో మెడికవర్ హాస్పిటల్ డాక్టర్ సుధీర్ తలేను సంప్రదించినట్లు తెలిపారు. డాక్టర్ పరీక్షించి బ్రోంకోస్కోపీ, సిటి స్కాన్ తదితర పరీక్షలు నిర్వహించి ఆమెకు "ఆల్వియోలార్ ప్రోటీనోసిస్" వ్యాధి ఉన్నట్లు నిర్ధారించారు. అనంతరం ఆమెకు సాధారణ అనస్థీషియాతో డబుల్ లంగ్ వెంటిలేషన్ ద్వారా సుమారు 15 లీటర్ల సెలైన్‌తో ఊపిరితిత్తులను డీప్ క్లీనింగ్ చేశారు. మూడు రోజుల తర్వాత ఆరోగ్యవంతమైన స్థితిలో ఆమెను డిశ్చార్జ్ చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రేమ్ కుమార్, డాక్టర్ సుధీర్ తలే మాట్లాడుతూ "పల్మనరీ ఆల్వియోలార్ ప్రోటీనోసిస్" అనే అరుదైన ఊపిరి తిత్తుల వ్యాధి కోటి మందిలో ఇద్దరికి వస్తుందని వివరించారు. హోల్ లంగ్ లావేజ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడం, అరుదైన పల్మనరీ వ్యాధులను తమ బృందం సమర్థవంతంగా నయం చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రకియ విజయవంతంలో పల్మోనాలజీ వైద్యులు డాక్టర్ సుధీర్ తలే, డాక్టర్ మొనీషా, డాక్టర్ సత్య పద్మజ, డాక్టర్ స్రవంతి, అనస్థీషియా వైద్య బృందం కృషిచేసినట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : గోపాలపట్నంలోని శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1973-74 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు బుధవారం కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. ముఖ్య అతిథిగా ఎపి.జెన్‌కో డైరెక్టర్ (హెచ్.ఆర్) ఐఆర్ సయ్యద్ రఫీ హాజరయ్యారు. పూర్వ విద్యార్థులంతా కలిసి తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు బి.లక్ష్మీనారాయణ శాస్త్రి, దాసరి సన్యాసిరావు, కృష్ణమూర్తి, బ్రహ్మానందం, కామేశ్వరమ్మ, శాంతికుమారి, భవాని పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు ఎఎస్.మూర్తి, బి.సోమేశ్వరరావు, సయ్యద్ వాసాయి, అచ్చంనాయుడు, ఈశ్వరరావు, శంకర్‌రెడ్డి, కమల్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఒకే చోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా మరియు సెషన్స్ కమ్ ఫ్యామిలీ జడ్జి కోర్టు, విశాఖపట్నం
F.C.O.P. No. 908 / 2023

బిట్వీన్:
బడితబోయిన రేణుకాదేవి ... వాది (పిటిషనరు)

మరియు:
కుంచాల సన్ని ... ప్రతివాది (రెస్పాండెంట్)

ప్రతివాదికి దావా సమన్లు

కుంచాల సన్ని, తండ్రి శంకరరావు
డో.నెం. 6-56-7/1, ఎర్రగడ్డకోలనీ,
శ్రామికనగర్, గాజువాక, విశాఖపట్నం-26.

పైన పేర్కొనబడిన వాది (పిటిషనర్) మీ నుండి విడాకులు పొందుకునే నిమిత్తం మీ మీద పైన పేర్కొనబడిన న్యాయస్థానంలో దావాదాఖలు చేయగా, మీ హాజరు నిమిత్తం తే:12-4-2024దీ నాటికి న్యాయస్థానం వారు వాయిదా వేసియున్నారు. కావున **తే:12-4-2024దీ నాటి ఉదయం 10-30 గంటలకు** మీరు స్వయంగా గాని లేదా మీచే సరియైన భోగట్టా యివ్వబడిన వకీలుగారి ద్వారా గానీ పై కోర్టులో హాజరుకావలెను. లేనియెడల పై వ్యాజ్యం మీ పరోక్షములో తీర్మానము జరుపబడునని తెలియజేయడమైనది.

వంటాకు అప్పారావు
న్యాయవాది, డో.నెం. 24-50-13
ఉడాకోలనీ, వినాయకనగర్,
పెదగంట్యాడ, విశాఖపట్నం.

IN THE HON'BLE COURT OF THE I ADDL SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
I.A.No. 749/2023 IN O.S 216/2023

Between:
Smt. KOTIPALLI PADMA . . . Petitioner
And:
Sri. CHEDALAVADA RAVICHAND & 2 others . . . Respondents

SUMMONS

To, Respondent No.1:
CHEDALAVADA RAVICHAND
S/o. Ramakrishna Rao, Aged 55 Years,
D.no. 15-15-43/22, flat 304,
Prathima Paradise, Krishna Nagar-01,
Maharani Peta, Visakhapatnam- 530002.

Please take the notice by way of this publication, Whereas the above- named PETITIONER instituted the above noted I.A. No.749/2023 IN O.S 216/2023 before the Hon'ble I Addl. Senior Civil Judge Court at Visakhapatnam for ad interim Injunction in favour of the Petitioner. As per the directions of the Hon'ble I Addl. Senior Civil Judge District Court at Visakhapatnam you are hereby summoned to appear in this Court in person or by a Pleader duly instructed and able to answer all material questions relating to the said claim, on **19-04-2024 at 10:30 A.M.** also take notice that in default of your filing an address for service before the day aforementioned. You are liable to have your defense struck out take notice that in default of your appearance on the day before mentioned, the Petition will be heard and determined in your absence.

(By Order of the Hon'ble Court)
PN.LAKSHMAN RAVI KUMAR & K.S.R.MURTHY Advocates.
D.No. 9-19-20/A, C.B.M.Compound,
Behind Sampath Vinayaka Temple,
Visakhapatnam - 530003.
Mobile. No.7013727667



దిష్టిబొమ్మల్లా శిలాఫలకాలు

- అటకెక్కిన చిల్లపేట పెద్దచెరువు సుందరీకరణ..
- ఎండమావిగా ట్యాంక్ బండ్ తరహా అభివృద్ధి
- నాడు గంటా, నేడు ముత్తంశెట్టి హామీలు ఉత్తుత్తివే

2018లో గంటా వేసిన శంకుస్థాపన శిలాఫలకం



గతేడాది ముత్తంశెట్టి శంకుస్థాపన ఫలకం

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటోవార్డు చిట్టివలస, చిల్లపేట పెద్ద చెరువును హైదరాబాద్ ట్యాంక్ బండ్ తరహాలో సుందరీకరించి, అభివృద్ధి చేస్తామంటూ 2014 ఎన్నికల్లో భీమిలి ఎమ్మెల్యేగా గెలిచి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. గెలిచాక నాలుగేళ్లు పట్టించుకోని గంటా 2019 ఎన్నికలకు దాదాపు ఏడాది ముందే, 2018 డిసెంబర్ ఒకటిన రూ.కోటి 98 లక్షలతో చెరువు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. చెరువు తూర్పు భాగంలో గట్టును పటిష్టవంతం చేసే పనులు పాక్షికంగా జరిగాయి. పనుల్లో తీవ్ర జాప్యం వల్ల గట్టుపై యధాతథంగా ముళ్ళ కంచెలు, పొదలు ఏపుగా పెరిగాయి. 2019లో ఎన్నికలు వచ్చేశాయి. చెరువు అభివృద్ధి అనేది ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందాన ఉంది.

2019 ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు గెలిచారు. రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రిగా కూడా పని చేశారు. ఆ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు అదే



సుందరీకరణకు నోచుకోని చిల్లపేట పెద్దచెరువు ఇదే

శాఖ పరిధిలో టూరిజంగా అభివృద్ధి చేసేందుకు గల అవకాశాలను వినియోగించుకోవడంలో ఒక విధంగా వైఫల్యం చెందినట్టుగానే భావించాలి. కారణాలు ఏమైనా గానీ మంత్రి పదవి కోల్పోయాక, ఎమ్మెల్యే హోదాలో ఇదే చెరువును 25 ఎకరాల్లో ఎపి గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.6కోట్ల 50 లక్షలతో సుందరీకరణ, పునరుద్ధరణ పనులకు గతేడాది జూలై ఒకటిన ముత్తంశెట్టి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. యంత్రాలతో పైపైనే పూడికతీత పనులు చేపట్టారు. టిడిపి హయాంలో జరిగినట్టుగానే మళ్ళీ చెరువు గట్టును పటిష్టవంతం చేసి, పూడికతీత పనులు చేపట్టారు. పనుల్లో జాప్యం వల్ల చెరువు ప్రస్తుతం యధాస్థితిలోనే ఉంది. అభివద్ధి, సుందరీకరణ పనులు నిలిచిపోవడంతో టాంక్ బండ్ తరహా అభివృద్ధి ఉత్తిదేఅని తేలిపోయిందంటూ స్థానికులు పెదవి విరుస్తున్నారు.

నాడు పంటలు..నేడు ప్లాట్లు..

36 ఎకరాల చెరువు గర్భం, 94 ఎకరాల ఆయకట్టు ఉన్న పెద్ద చెరువు కింద ఒకప్పుడు 26 ఎకరాల్లో వరి, 8 ఎకరాల్లో కొబ్బరి, మరో 8 ఎకరాల్లో సరుగుడు సాగుచేసేవారు.. పట్టణీకరణ ప్రభావంతో పంట పొలాల స్థానంలో ప్లాట్లు, బహుళ అంతస్తుల నిర్మాణాలు జోరందుకున్నాయి. అయితే చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులు మాత్రం ఒక్కడుగైనా ముందుకు కదలకుండా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన అలాగే ఉండిపోయింది.

గంభీరంలో యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోని గంభీరం రిజర్వాయరు సమీపంలో బుధవారం యువకుని మృతదేహం లభ్యమైంది. వివరాలివి. విశాఖపట్నం కొమ్మాది, సాయిరాం కాలనీకి చెందిన వరాడ మదన్‌మోహన్ (35) గంభీర రిజర్వాయర్ పక్కన మృతి చెంది ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. తల్లి రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడు మదన్మోహన్ లావా మొబైల్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ కంపెనీకి శ్రీకాకుళం విశాఖపట్నం విజయనగరం జిల్లాల్లో బ్రాంచీలు ఉండడంతో మదన్మోహన్ డ్యూటీకి చెప్పి బైక్‌పై బయలుదేరాడు. సాయంత్రం రాకపోయేసరికి భార్య సంతోషి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అయి ఉన్నట్లు గుర్తించారు. కంపెనీలో సంప్రదించగా డ్యూటీకి రాలేదని చెప్పడంతో బంధువులు సహాయంతో మొబైల్ లొకేషన్ గుర్తించగా, చివరగా ఆనందపురం మండలం గంభీరం ఏరియాలో ఉన్నట్లు గుర్తించారు. కుటుంబ సభ్యులు వెతకగా రాత్రి సమయంలో కనపడలేదు. మరల బుధవారం ఉదయం వెతకగా బైక్‌ను గుర్తించారు. తర్వాత గంభీరం రిజర్వాయర్‌లో మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు.

మృతుడుకు మదన్‌మోహన్‌కు ఏడేళ్ల క్రితం సంతోషితో వివాహమైంది. వీరికి భాగ్యశ్రీ అనే పాప ఉంది. తన కొడుకు మృతిపై ఎటువంటి అనుమానం లేదని, ఆర్థిక బాధలు ఏవైనా ఉన్నాయో తెలియదని మృతుని తల్లి రమాదేవి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దర్యాప్తు చేయాలని కోరారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆనందపురం సిఐ టి. తిరుపతిరావు ఆధ్వర్యంలో ఎస్ఐ శివకుమార్ దర్యాప్తు చేస్తున్నారు

చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -పెందుర్తి : .జివిఎంసి 93వ వార్డు దుర్గానగర్‌లో చెట్టుకు ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. సిఐ రామకృష్ణ తెలిపిన వివరాలివి.

పల్లి నారాయణపురానికి చెందిన కర్రి నరేంద్ర (39) మద్యం అలవాటు ఉంది. టైలరింగ్ వృత్తితో జీవనం సాగిస్తున్న నరేంద్ర గతంలోనూ ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించాడు. అప్పట్లో ప్రాణాలతో బయటపడ్డాడు. బుధవారం మరోమారు ఎవరూ లేని సమయంలో శంకర ఫౌండేషన్ ఆసుపత్రికి సమీపంలో ఉన్న ఒక చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పెందుర్తి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రామకృష్ణ తెలిపారు.

చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -పెందుర్తి : మండలంలోని కృష్ణరాయపురంలో చెట్టుపైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. సిఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం, గురువారం గ్రామంలో ముత్యమాంబ అమ్మవారి పండగ నేపథ్యంలో వేప కొమ్మలు తెచ్చేందుకు వెళ్లిన గంగులు(53) ఉదయం 10 గంటల సమయంలో చెట్టు ఎక్కి వేపకొమ్మలు కోస్తుండగా, ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడిపోయాడు. ఈ ఘటనలో తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని, ఘటనపై వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రామకృష్ణ తెలిపారు.

డీజిల్ అక్రమ రవాణా ముఠా అరెస్ట్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖ నగరంలో అక్రమంగా డీజిల్ అమ్మకాలు నిర్వహిస్తున్న ముఠాలో ముగ్గురిని అరెస్టు చేసినట్లు విశాఖపట్నం డిసిపి - 2 ఎం.సత్తిబాబు తెలిపారు. బుధవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, సముద్రం నుండి అక్రమ రవాణా ద్వారా డీజిల్ విశాఖపట్నం తీసుకొచ్చి తక్కువ ధరలకు అమ్ముతున్నారని తెలిపారు. పట్టుబడిన ముగ్గురిలో బడేరాజు (32), నోల్లి వీర్రాజు (43) అమ్మకం దారులు కాగా సురాడ రాము (34) కొనుగోలుదారుడని వివరించారు. ఈ ముఠాలోని మరొక పదిమంది పరారీలో ఉన్నారని తెలిపారు. నిందితుల నుంచి 500 లీటర్ల డీజిల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారు ఈ డీజిల్‌ను కాకినాడ, మచిలీపట్నం నుండి సముద్ర మార్గం ద్వారా అక్రమంగా విశాఖకు తీసుకొచ్చి రూ.60 నుంచి రూ.70కి విక్రయిస్తున్నారని చెప్పారు. ఈ మీడియా సమావేశంలో హార్బర్ ఎసిపి మోసెస్ పాల్, ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ సిఐ బి.భాస్కరరావు పాల్గొన్నారు.

20 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి -కొత్తకోట : నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 20లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని, తయారీకి సిద్ధంగా ఉంచిన మరో 800 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేసినట్లు రావికమతం ఎస్ఐ ధనుంజయ నాయుడు తెలిపారు. రావికమతం మండలంలో కే.కొట్నాబిల్లి శివారు గదబపాలెం గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేయగా సారా అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్దనుంచి సారాతో పాటు తయారీకి సిద్ధంగా ఉంచిన పులుపును ధ్వంసం చేశామన్నారు. కేసు నమోదు చేశామని నాటుసారా తయారీపై ప్రత్యేక నిఘా ఉంచామని, గ్రామాలలో సారా తయారు చేసిన, అమ్మినా తమకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు.

1300 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్ : గొలుగొండ మండలం పాతకృష్ణదేవిపేట పరిసర ప్రాంతాల్లో నాటు సారా తయారీ బట్టీలపై సిబ్బందితో దాడులు నిర్వహించామని కృష్ణదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర బుధవారం తెలిపారు. ఈ దాడుల్లో సారా తయారు చేసేందుకు ఉపయోగించే బెల్లం పులుపు 1300 లీటర్లను ధ్వంసం చేసి, డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నామన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కేసును నమోదు చేసి అరెస్టు చేస్తామన్నారు.

16 మద్యం బాటిళ్లు పట్టివేత

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట :మండలంలోని రాజాం గ్రామశివారులో మద్యం విక్రయిస్తున్న వ్యక్తి నుండి బుధవారం 16 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు బుచ్చయ్యపేట ఎస్ఐ, డి.ఈశ్వరరావు తెలిపారు. తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి అక్రమంగా మద్యం ను విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకొని, అతని వద్ద 16 మద్యం సీసాలను స్వాధీన పరుచుకుని, అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కి పంపినట్లు ఎస్‌పి పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృత్యువాత

ప్రజాశక్తి -పెందుర్తి : ఇటీవలే సుజాతనగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిన్న ముషిడివాడ ప్రాంతానికి చెందిన పిల్లా లోకేష్ బుధవారం ఆసుపత్రిలో మృత్యువాత పడ్డాడు. క్షతగాత్రుడిని అపుడే ప్రయివేటు ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందించారు. చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో మరణించాడు.దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రామకృష్ణ తెలిపారు.

ఎన్నికల యంత్రాంగం ముమ్మర తనిఖీలు





కూటమి అభ్యర్థి పంచకర్ల కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- పెందుర్తి : ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల యంత్రాంగం ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు. ఎన్నికలను ప్రభావితం చేసే నగదు, మద్యం, కానుకలు, ఇతరత్రా ఎటువంటి సామగ్రి అక్రమ రవాణాకు ఆస్కారం లేకుండా ప్రత్యేక నిఘా పెట్టి పటిష్ట తనిఖీలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా పెందుర్తి, సరిపల్లి మధ్యలో చెక్‌పోస్ట్ ఏర్పాటుచేసి, నిరంతరం సోదాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే బుధవారం మండలపరిషత్ కార్యాలయం సమీపంలో పెందుర్తి వైపు నుంచి వస్తున్న కూటమి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు వాహనాన్ని ఎన్నికల సిబ్బంది ఆపి తనిఖీలు చేశారు. వీడియోగ్రఫీ రికార్డు చేశారు. ఎన్నికల్లో భాగంగా తనిఖీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ ఎస్‌సి సెల్ ప్రధానకార్యదర్శిగా రాజబాబు



నియామక పత్రం అందుకుంటున్న రాజబాబు,

ప్రజాశక్తి -గాజువాక :గాజువాక నియోజకవర్గం పెదగంట్యాడకు చెందిన ములకలపల్లి రాజుబాబును విశాఖ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు విశాఖ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ చైర్మన్ పెద్దాడ గణ నాగఫణి బుధవారం ఉత్తర్వులు జారీ చేయగా, వాటిని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు అందజేశారు కార్యక్రమంలో ఎపిసిపి జనరల్ సెక్రెటరీ గాదం మహేష్, 64వ వార్డు అధ్యక్షులు యరబాల భూలోక పాల్గొన్నారు.

వైసిపి నేతకు పరామర్శ

ప్రజాశక్తి -గాజువాక : ఇటీవల ప్రమాదానికి గురై చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్న జివిఎంసి 87వ వార్డు వైసిపి నేత దుగ్గపు దానప్పలును విడిఆర్‌డిఎ చైర్మన్ సనపల చంద్రమౌళి బుధవారం పరామర్శించారు. యోగక్షేమాలను అడిగి తెలుసు కున్నారు. త్వరగా కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యం సిద్ధించాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో గాజువాక మండల క్లస్టర్ 4 అధ్యక్షులు ప్రగడ వేణుబాబు, కార్యదర్శి ముద్దపు దామోదర్, మార్పు శేషు, బోండా గోవిందరాజులు, ముద్దపు మురళీమోహన్, మురళీకృష్ణ ఉన్నారు.



దానప్పలును పరామర్శిస్తున్న చంద్రమౌళి

డంపింగ్ యార్డు తరలింపులో నిర్లక్ష్యం!

- ప్రజారోగ్యం పట్టని ప్రభుత్వం, జివిఎంసి యంత్రాంగం
- సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

ప్రజాశక్తి-గాజువాక : జివిఎంసి గాజువాక జోన్ 76వ వార్డు రామచంద్రనగర్ ప్రాంతంలో ఉన్న మున్సిపల్ చెత్త డంపింగ్ యార్డ్‌ను తక్షణమే తరలించాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు డిమాండ్ చేశారు. బుధవారం డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతీయులతో కలిసి డంపింగ్ యార్డ్‌ను సందర్శించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని పరిరక్షించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, జివిఎంసి, చెలగాటమాడుతోందని దుయ్యబట్టారు. 76వ వార్డు రామచంద్రనగర్, స్వతంత్ర నగర్, డెయిరీ కాలనీ, బర్మా కాలనీ, రిక్షాకాలనీ, గాంధీనగర్ తదితర 16 గ్రామాల ప్రజలతో పాటు సర్దార్ నెస్ట్, నోవస్ తదితర అపార్ట్‌మెంట్ల వాసులు ఈ డంపింగ్‌యార్డు వల్ల తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గర్భిణులు, పిల్లలు, వృద్ధులు రకరకాల వ్యాధులకు గురై వైద్యానికి వేలల్లో ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. చెత్తకు సైతం పన్ను వేసి ముక్కుపిండి వసూలు చేస్తున్న ప్రభుత్వం, జివిఎంసి ప్రజారోగ్యశాఖ దుర్గంధం, చెత్తాచెదారంతో అవస్థలు పడుతున్న ప్రజల కష్టాలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డును జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయడమే కాకుండా, ఉన్నవాటిని తరలించాలని డిమాండ్ చేశారు. 76వ వార్డు ప్రజల ఆరోగ్యంపై దాడిచేస్తున్న ప్రభుత్వం, జివిఎంసి యంత్రాంగం ఇప్పటికైనా కళ్ల తెరవాలని, లేకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.



డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న సిపిఎం నేతలు జగ్గునాయుడు, రాంబాబు, స్థానికులు

సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం రాంబాబు మాట్లాడుతూ 2013 నుంచి నేటివరకు డంపింగ్ యార్డు తరలించాలని ఈప్రాంతీయులు పలు రూపాల్లో ఆందోళన చేస్తున్నా ప్రభుత్వాలు, అధికారులు స్పందించడం లేదన్నారు. ప్రజాందోళనలకు నాడు,నేడు, రేపు కూడా సిపిఎం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. గతంలో తెలుగుదేశం తరపున పల్లా శ్రీనివాసరావు, ప్రస్తుతం వైసిపి ఎమ్మెల్యేగా తిప్పల నాగిరెడ్డి పదవులు నిర్వహించినా డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి కనీసం చొరవ చూపలేదన్నారు. ప్రజలకు హామీలివ్వడం, గెలిచాక సమస్యను పక్కన పెట్టడం వీరికి పరిపాటిగా మారిందన్నారు. జివిఎంసి యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకుంటే ప్రజాఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం గాజువాక జోన్ నాయకులు డి.రమణ, రాజు, రాముడు స్థానిక సంఘాల నాయకులు రాజారావు, త్రినాధరావు, చిన్నారావు, జనార్దనరావు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం



ఆర్ఆర్.వి పురంలో ఇంటింటా ప్రచారంలో గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు ఆర్ఆర్‌వి పురం, బాపూజీ నగర్, శ్రీరామ్‌నగర్ ప్రాంతాల్లో తెలుగుదేశం, బిజెపి, జనసేన కూటమి పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే పి. గణబాబు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం సూపర్ సిక్స్ పథకాలను వివరించారు.ప్రచారంలో భాగంగా గణబాబుకు స్థానిక ప్రజలు అడుగడుగునా పూలమాలతో ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చి ఆశీర్వదించారు.ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో పశ్చిమ ఎమ్మెల్యేగా తనను, విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్‌ను సైకిలు గుర్తుపై ఓటేసి మంచి మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో టిడిపి, జనసేన, బిజెపి నేతలు ం బాలసుబ్రహ్మణ్యం , పొరమరశెట్టి సీతారాం, దాడి రమేష్‌నాయుడు, మూర్తి పట్నాయక్, నారిపిన్ని సత్తిరాజు, జుత్తాడ శ్రీనివాసరావు, బత్తులరాజు, కనకకుమార్, ఇల్లపు కనకరాజు, గొంతిన శ్రీనివాసరావు, కంపర ఆనంద్, బొడ్డేటి ఉమ, నరవ అనూష, సునీల్, కె..కోటేశ్వరరావు ,కొల్లి అప్పారావు, రాజు, సిహెచ్ దివాకర్, కందా వాసు, పి.శ్రీనివాసరావు, నాయుడు, కరణం సంతోషి పాల్గొన్నారు

ఇంటింటి ప్రచారానికి అనుమతులు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ భాస్కర రెడ్డి

ప్రజాశక్తి-భీమునిపట్నం : ఇంటింటా ఎన్నికల ప్రచారానికి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, స్థానిక ఆర్‌డిఒ ఎస్ భాస్కరరెడ్డి రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. బుధవారం సాయంత్రం గుర్తింపుపొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులతో పాటు ఇంటింటి ప్రచారానికి అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు

దీనికోసం సువిధ యాప్‌ను రూపొందించినట్లు వివరించారు. ఆన్‌లైన్‌లో నామినేషన్లు, అఫిడవిట్లను దాఖలు చేసేందుకు కూడా ఈ యాప్‌ను వినియోగించుకోవచ్చని సూచించారు. సమావేశంలో తహశీల్దార్ టి గోవింద్, ఎన్నికల డిటి భాస్కర రావు, రాజకీయపార్టీల ప్రతినిధులు వైసిపి నుంచి ముత్తంశెట్టి మహేష్, టిడిపి నుంచి డిఎఎస్ రాజు, గంటా నూకరాజు, కాంగ్రెస్ నుంచి పల్లా వెంకటరావు పాల్గొన్నారు.

మేఘాద్రి రిజర్వాయరు నిర్వహణలో నిర్లక్ష్యం

ప్రజాశక్తి- పెందుర్తి : నగరానికి తాగునీటిని సరఫరా చేసే మేఘాద్రి గెడ్డ రిజర్వాయర్ నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని జిల్లా కాంగ్రెస్ నేత ఆర్ఆర్.నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మేఘాద్రిగెడ్డ రిజర్వాయర్, తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులుపర్యటించారు. ఈ సందర్భంగా ఆర్ఆర్ నాయుడు మాట్లాడుతూ పూడికలు తీయకపోవడం వల్ల మేఘాద్రి మట్టి పేరుకుపోయి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోందని, తద్వారా నగరానికి నీటిఎద్దడి ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వెలిబుచ్చారు. రిజర్వాయర్ గట్టుపై ఉన్న ఇనుప రెయిలింగ్ తుప్పు పట్టి పాడైతోందని, వాటిని తక్షణమే రంగులు వేయాలని కోరారు. వైసిపి పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటుబడిందని అసహనం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు విన్నకోట రాము తదితరులు ఉన్నారు

ఉత్తరాంధ్రులను అవహేళన చేస్తే ఊరుకోం



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార: ఉత్తరాంధ్ర ప్రజలను అవహేళన చేస్తే సహించేది లేదని వైసిపి ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె రాజు స్పష్టం చేశారు. బుధవారం జివిఎంసి 50వ వార్డు మాధవధార వద్ద స్థానిక కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు మతిభ్రమించినట్లు మహిళలు, వైసిపి నేతలపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో విష్ణుకుమార్‌రాజు చిత్తుగా ఓడించి, వైసిపి విజయకేతనం ఎగరేస్తామన్నారు. మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌ను సాదర స్వాగతం పలకడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు చల్ల రజని ఈశ్వరరావు, కార్పొరేటర్లు కె. అనిల్‌కుమార్ రాజు, సారిపిల్లి గోవింద్, రెయ్యి వెంకటరమణ, బర్కత్‌అలీ, కెవిఎన్ శశికళ, .జెసిఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భగవతి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కెకె.రాజుకు పలుసంఘాల మద్దతు

ఉత్తర నియోజకవర్గ వైసిపి అభ్యర్థి కెకె.రాజుకు పలు సామాజిక, ప్రజాసంఘాలు మద్దతుగా నిలుస్తున్నారు. బుధవారం పార్టీ కార్యాలయానికి వచ్చిన పలు సంఘాల నేతలు సంపూర్ణ మద్దతు తెలిపి, రాజు విజయానికి కృషి చేస్తామని భరోసానిచ్చారు.

అనుబంధ సంఘాల నేతలు కృతజ్ఞతలు

ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె రాజు సూచనతో ఇటీవల పలు వార్డుల్లో నియమితులైన పార్టీ అనుబంధ సంఘాల నేతలు బుధవారం కెకె.రాజును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి తాము సైనికుల్లా పనిచేసి, రాజు గెలుపునకు కృషి చేస్తామన్నారు.

వైసిపి ఇంటింటా ప్రచారం



ఇంటింటి ఎన్నికల ప్రచారంలో ఆనందకుమార్

ప్రజాశక్తి -ములగాడ: జివిఎంసి 60వ వార్డులోని స్థానిక కార్పొరేటర్ పి.వి.సురేష్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్నికల ర్యాలీ నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గ వైసిపి అభ్యర్థి ఆడారి ఆనందకుమార్ పాల్గొని ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనకు గజమాలతో స్వాగతించారు. ఈ సందర్భంగా ఆనందకుమార్ మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజలకు చేరువగా ఉండి ఇప్పటికే పలు సమస్యలను పరిష్కరించడంతోపాటు అభివృద్ధి పనులు చేపట్టానని, తనకు ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశమిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో పీలా రమణకుమారి, వార్డు అధ్యక్షుడు ఆడారి హరీష్, సురేష్ ,మనోజ్, శ్రీను పాల్గొన్నారు,

గోపాలపట్నం : 92వ వార్డు ఇందిరానగర్, నరసింహ నగర్ ప్రాంతాలలో జివిఎంసి కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు వైసిపి కార్యకర్తలు నాయకులు గడపగడపకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.. ప్రతి ఇంటిని సందర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో పశ్చిమ ఎమ్మెల్యేగా ఆడారి ఆనందకుమార్, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీకి ఓటేసి మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ రాష్ట్ర గునిశెట్టి శ్రీనివాసరావు, గేదెల మురళీకృష్ణ, బండారు శ్రీనివాసరావు, కడిమి రామకృష్ణ, మార్కండేయ రాజశేఖర్, కంపర సత్తిబాబు, కంపర కోటేశ్వరరావు, ఊటపల్లి గోవిందు, నీలాపు మహాలక్ష్మిరెడ్డి, నీలాపు శ్రీనివాసరెడ్డి, ఉంగ్రాళ్ల ప్రకాష్, సురేష్, గొద్దు నాగరాజు, గొల్కొండ శ్రీనివాసరావు, సాగర్, సీతారామరాజు, అభిరాం, జగదీష్, నల్ల రామకృష్ణ, షేక్ వల్లి, శంకరరావు, కమలాదేవి, ఒరిపల్లి విజయ వెంకటలక్ష్మి, ఆర్ని లలిత పాల్గొన్నారు.

వైసిపి శ్రేణులతో బొత్స ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి -తగరపువలస : సిఎం జగన్మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే వైసిపి అభ్యర్థుల విజయానికి దోహద పడతాయని రాష్ట్రమంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. బుధవారం స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో వైసిపి నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భీమిలి ఎమ్మెల్యేగా ముత్తం శెట్టి శ్రీనివాసరావును, ఎంపిగా బొత్స ఝాన్సీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, విపక్షాల నుంచి ఎవరు బరిలో ఉన్నా వైసిపి విజయం తథ్యమన్నారు. వైసిపి రీజనల్ యూత్ కో ఆర్డినేటర్ ముత్తంశెట్టి శివ నందీష్, జెడ్పీ వైస్‌చైర్మన్ ఎస్ గిరిబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డి పెదబాబు, ఎఎంసి చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, ఎంపిపి దంతులూరి వాసురాజు, నాల్గో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండ బాబు, పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, పార్టీ నాయకులు సరగడ రఘునాథరెడ్డి పాల్గొన్నారు



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న బొత్స

డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా విష్ణుమూర్తి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎస్‌విఎల్‌ఎన్ ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా, కామర్స్ లెక్చ రర్ డాక్టర్ సిహెచ్ విష్ణుమూర్తి బుధవారం పూర్తి అదనపు బాధ్యతలతో ప్రిన్సిపల్‌గా బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ప్రిన్సిపల్‌గా పనిచేసిన డాక్టర్ ఆర్.మంజుల విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపల్‌గా బదిలీపై వెళ్లారు



డాక్టర్ సిహెచ్ విష్ణుమూర్తి

ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని నాలుగు పరీక్ష కేంద్రాలలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఏడాది మద్దిలో 178మంది, రెడ్డిపల్లిలో 181మంది, పద్మనాభంలో 180 మంది, ఆర్‌వి. పురం హైస్కూల్లో 163 మంది టెన్త్ పరీక్షలు రాశారు. పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

ప్రజాశక్తి
గురువారం 28 మార్చి 2024

తాడి గ్రామాన్ని తరలించకుంటే సార్వత్రిక ఎన్నికలను బహిష్కరిస్తాం

- ఆ గ్రామస్తులు స్పష్టీకరణ
- కాలుష్యంతో అల్లాడుతున్నామని ఆవేదన
- ప్రభుత్వాలు పట్టించుకోలేనందున నిర్ణయం

ప్రజాశక్తి - పరవాడ

అనకాపల్లి మండలంలోని తాడి గ్రామాన్ని తరలించాలని లేనిపక్షంలో గ్రామస్తులంతా రానున్న సార్వత్రిక ఎన్నికలు బహిష్కరిస్తున్నట్లు బుధవారం తాడి గ్రామంలో మీడియా సమావేశం ఏర్పాటుచేసి గ్రామస్తులంతా ముక్తకంఠంతో వెల్లడించారు. తాడి గ్రామం ఫార్మాసిటీ కోరలలో చిక్కుకొని అల్లాడుతోందని, 17 ఏళ్ల నుంచి మూడు ప్రభుత్వాలు కాంగ్రెస్, తెలుగుదేశం, వైసిపి మారినా తాడి గ్రామాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తంచేశారు. ఫార్మా సిటీ నిర్మాణానికి ముందే గ్రామాన్ని తరలిస్తామని, అధికారులు మినిట్ పెట్టి గ్రామాన్ని తరలిస్తున్నారని చెప్పి ల్యాండ్ ఫిల్‌కు పర్మిషన్ ఇవ్వాలని అడిగారని వివరించారు. గ్రామాన్ని తరలించడానికి రాంకీ చైర్మన్ అయోధ్య రామిరెడ్డి రూ.56 కోట్లు రిలీజ్ చేస్తున్నట్లు చెక్కును కూడా రాసి గ్రామస్తులకు చూపించారని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు గ్రామం తరలించలేదన్నారు. ఇప్పుడు మాట మార్చి ప్రభుత్వం గ్రామాన్ని తరలించాలని, తామెందుకు మీ గ్రామాన్ని తరలించాలని రాంకీ యాజమాన్యం తప్పించుకు తిరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఒక్కొక్కసారి అర్ధరాత్రి సమయంలో ఫార్మా కంపెనీలు తగలబడిపోతే చంటి పిల్లలను చంకలో పెట్టుకొని పరుగులు తీసిన రోజులు ఎన్నో ఉన్నాయని తెలిపారు. తరలింపునకు తెలుగుదేశం ప్రభుత్వం జిఒ తీసుకొచ్చిందని,ఈ లోపు ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయిందని, తర్వాత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మరో జిఒ తెచ్చి రెండు నెలలలో గ్రామాన్ని తరలిస్తామని సబ్బవరం మండలంలో జగనన్న కాలనీల శంకుస్థాపనకు వచ్చిన సందర్భంలో ప్రకటించినా నేటికీ తరలింపునకు నోచుకోలేదన్నారు. ఇప్పుడు రాంకీ వారు గ్రామాన్ని ఆనుకొని ఉన్న గ్రీన్ బెల్ట్, బఫర్ జోన్ ఏరియాలో పైపులను వేస్తున్నారని, దీనిపై గ్రామస్తులంతా అడ్డుకొని పోలీసులకు ఫిర్యాదు చేసి చర్చలు జరుపుతున్నామని తెలిపారు. గతంలో గ్రామాన్ని ఆనుకొని 50 ఎకరాలు ల్యాండ్‌ఫిల్‌కు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిచ్చిందని, దీనిపై పరవాడ తహశీల్దార్ కార్యాలయం పక్కన ప్రజాభిప్రాయసేకరణ ఏర్పాటు చేస్తే గ్రామస్తులంతా ఏకతాటిపై బహిష్కరించామని గుర్తుచేశారు. ఇన్ని చేసినా గ్రామాన్ని తరలించలేనందున రానున్న సార్వత్రిక ఎన్నికలను బహిష్కరిస్తున్నామని చెప్పారు. గ్రామం తరలింపునకు జిల్లా కలెక్టర్ పూర్తి హామీ ఇస్తే ఎన్నికల్లో పాల్గొంటామని, లేని పక్షంలో పార్టీలకతీతంగా ఏకతాటిపై బహిష్కరిస్తామని స్పష్టంచేశారు. ఈ మేరకు డిమాండ్‌పత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి మాధంశెట్టి నీలబాబు, మాజీ సర్పంచ్ బోండపల్లి అప్పారావు, ఎంఎస్ఎంఇ డైరెక్టర్ దళాయి నదియా, కోమటి అచ్చిబాబు, కోమటి సూరిబాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, కోమటి కులదీప్ రాజ్, జిత్తుల మాధవరావు, గొల్లవిల్లి అచ్చిబాబు, గనిరెడ్డి కనకారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న తాడి గ్రామస్తులు

షర్మిల పోరాట పటిమతో ఎపికి ప్రత్యేక హోదా తథ్యం

ప్రజాశక్తి- అనకాపల్లి

ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇందిరమ్మలో చూసిన ఉక్కు సంకల్పాన్ని నేడు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిళలో చూస్తున్నారని ఎపిసిసి అధికార ప్రతినిధి ఐఆర్.గంగాధర్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ షర్మిల పోరాట పటిమతో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా తేవడం తథ్యమన్నారు. వచ్చే ఎన్నికలలో ఆంధ్ర ప్రదేశ్ ప్రజలు విజ్ఞతతో ఓటు వేయలని కోరారు. స్పష్టమైన హామీలను ఈ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిందని చెప్పారు. అందరికీ న్యాయం చేయడమే రాహూల్ గాంధీ లక్ష్యమని, ప్రతి పేద కుటుంబానికి మహాలక్ష్మి పథకం ద్వార 5 సంవత్సరాల్లో రూ.5 లక్షలు ఆర్థిక లబ్ధి చేకూర్చనున్నట్లు చెప్పారు. గత పదేళ్ళుగా సంజీవిని లాంటి ప్రత్యేక హెూదా అంశాన్ని ఎపికి రాకుండా బీజేపితో కలసి టిడిపి, వైసిపిలు అన్యాయం చేశాయని విమర్శించారు. బిజెపి దేవుడి పేరుతో రాజకీయాలు చేయటం తప్ప, దేశానికి, దేశ ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. తన కార్పొరేట్ స్నేహితులకు దేశ సంపదను మోడీ ప్రభుత్వం దోచిపెట్టిందని ఆరోపించారు. ఎలక్టోరల్ బాండ్ల స్కాం ద్వారా బిజెపి దోపిడీ దేశ ప్రజలకు మరో మారు స్పష్టమైందని తెలిపారు. నేడు రాష్ట్రంలో బిజెపి అంటే బాబు (బి) జగన్(జె) పవన్ (పి) అనేది ఎపి ప్రజలకు అర్థమైందని, ఈ ముగ్గురిలో ఓటు ఎవరికి వేసినా ఆ ఓటు బీజేపీ ఖాతాలోనే పడుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర, దేశ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలని గంగాధర్ విజ్ఞప్తి చేశారు.

కార్పెంటర్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రంలో కార్పెంటర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీ రాష్ట్ర కార్పెంటర్స్ వడ్రంగి అసోసియేషన్, శ్రీ కామాక్షి పట్టణ కార్పెంటర్ సంఘం శాశ్వత గౌరవ అధ్యక్షులు కోసూరి మన్మధరావు, అధ్యక్షులు వానపల్లి కోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. కార్పెంటర్స్ డే సందర్భంగా బుధవారం అనకాపల్లి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సింహాద్రి కోటేశ్వరరావు, కోశాధికారి మునాసన రామకృష్ణ, పట్టణ కామాక్షి కార్పెంటర్స్ సభ్యులు, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.


వికలాంగునితో మాట్లాడుతున్న భరత్‌కుమార్

వైసిపి అభ్యర్థి భరత్‌కుమార్ ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ బుధవారం జివిఎంసి 83వ వార్డు కార్పొరేటర్ జాజుల లక్ష్మీ ప్రసన్న రమేష్ ఆధ్వర్యంలో ఆ వార్డు పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రాబోయే ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి తమను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా భరత్ కుమార్ మాట్లాడుతూ పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు. ఎమ్మెల్యేగా తనకు ఒక అవకాశం ఇస్తే అనకాపల్లి నియోజకవర్గంలో యువతకి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, అనకాపల్లి మండల అధ్యక్షులు పెద్దిశెట్టి గోవిందు, అనకాపల్లి, కశింకోట మండలాల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న భరత్ కుమార్

కశింకోట : అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం వైసిపి అభ్యర్థి మలసాల భరత్ కుమార్ మండలంలోని లాలం కొత్తూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీనూకంబిక అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. భరత్‌కుమార్‌కు ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి సత్కరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు మలసాల కిషోర్, గ్రామ సర్పంచ్ బండారు వాసు, మాజీ సర్పంచ్ రాయవరపు సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

'సింబయో' ప్రమాద బాధితుల్లో మరొకరు మృతి

నర్సింగరావు కుటుంబానికి నష్టపరిహారం చెల్లింపునకు ఒప్పందం

ప్రజాశక్తి -రాంబిల్లి

అచ్యుతాపురం ఎస్ఇజెడ్ పరిధి, రాంబిల్లి మండలంలోని సింబయో జెనరిక్స్ ఫార్మా కంపెనీలో ఈ నెల 14న బాయిలర్ వద్ద జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిలో మరో కార్మికుడు మృతి చెందారు. రాంబిల్లి మండలం, పెద్ద కలవలపల్లి గ్రామానికి చెందిన కలవలపల్లి నర్సింగరావు 13 రోజుల పాటు మృత్యువుతో పోరాడి విశాఖపట్నం ఆరిలోవ అపోలో ఆసుపత్రిలో మృతి చెందారు. మృతుని కుటుంబానికి నష్టపరిహారం చెల్లింపుపై సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడు నాయుడు, పెదకలవలపల్లి మాజీ ఎంపిటీసీ ప్రసాద్ తదితరులు రాంబిల్లి సిఐ లక్ష్మణరావు సమక్షంలో కంపెనీ ప్రతినిధులు సింబయో కంపెనీ జనరల్ మేనేజర్, హెచ్‌ఆర్‌తో చర్చలు జరిపారు. మృతుడు నర్సింగరావు కుటుంబానికి సింబయో కంపెనీ నుండి రూ.20 లక్షలు, కాంట్రాక్టర్ నుండి రూ.2.75 లక్షలు ఇవ్వడానికి ఒప్పందం జరిగింది.


నర్సింగరావు (ఫైల్‌ఫొటో)

కొణతాలకు మద్దతుగా సినీ నటుడు పృథ్వీ ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం జనసేన, బిజెపి, టిడిపి కూటమి అభ్యర్థి కొణతాల రామకృష్ణకు మద్దతుగా సినీ నటుడు పృథ్వీ బుధవారం అనకాపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని ఉడ్‌పేట, బాలాజీరావు పేట తదితర ప్రాంతాల్లో పర్యటించి గ్లాస్ గుర్తుపై ఓటు వేసి, రామకృష్ణను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి వాడుకొని వదిలేయటం అలవాటుగా మారిందన్నారు. సిద్ధం సిద్ధం అనటం ఓడిపోవడానికా అంటూ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దూలం గోపి, మల్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : కసింకోట మండలం వెదురుపర్తి గ్రామాల్లో సినీ నటుడు పృథ్వీ బుధవారం జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణకు మద్దతుగా ప్రచారం చేశారు. గాజు గ్లాస్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కశింకోట మండలం జనసేన అధ్యక్షులు బుదిరెడ్డి చిన్న, పలువురు నాయకులు పాల్గొన్నారు.


కశింకోట మండలం వెదురుపర్తిలో ప్రచారం చేస్తున్న పృథ్వీ

కరెంట్ వైరు ముట్టుకున్నా షాక్ కొట్టని పరికరం రూపకల్పన

ప్రజాశక్తి- అనకాపల్లి

మన ఇంట్లో చిన్నపిల్లలు పొరపాటున కరెంట్ వైర్లు, సాకెట్స్ ముట్టుకుని షాక్‌కు గురవుతున్నారు. ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ సమస్యకు పరిష్కారం చూపారు స్థానిక డైట్ కళాశాలలో 2వ సంవత్సరం ఈ.సి.ఈ చదువుతున్న విద్యార్థులు నాళం హేమలత, రెడ్డి అలేఖ్య, ఆడారి అమృత, మెట్ట ఝాన్సీలక్ష్మి. వారు రూపొందించిన పరికరానికి అమర్చిన సెన్సార్ ద్వారా కరెంట్ వైర్ ముట్టుకోగానే సెన్సార్ యాక్టివ్ అయ్యి విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ప్రోజెక్ట్ ఇంజినీర్ భమిడిపాటి శేషగిరి రావు తెలిపారు. ఈ పరికరం తయారు చేయడానికి ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్, 12ఓల్ట్స్ పవర్ సప్లయ్, సర్క్యూట్ బ్రేకర్, బల్బ్, వైర్ వాడినట్లు, దీనికి కేవలం రూ.400 ఖర్చు చేసినట్లు విద్యార్థినులు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ఈ పరికరం ఎంతగానో ఉపయోగ పడుతుందని విద్యార్థులను ప్రశంసించారు. ఈ ప్రాజెక్ట్ చేయడానికి గైడ్ చేసిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.వీర్రాజును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, శేషగిరిరావును అభినందించారు. కార్యక్రమంలో ఈసిఈ విభాగాధిపతి డాక్టర్ పి.పూర్ణ ప్రియ, డీన్ అకాడమిక్ డాక్టర్ కె.పార్వతి పాల్గొన్నారు.


పరికరం గురించి తెలియజేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

బూడికి ఎంపీ టికెట్ కేటాయింపుపై హర్షం

ప్రజాశక్తి -అనకాపల్లి

అనకాపల్లి పార్లమెంట్ వైసిపి టికెట్ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుకు కేటాయించడం పట్ల ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వైసిపి యువజన విభాగం రాష్ట్ర నాయకుడు పలక రవి ఆధ్వర్యంలో అనకాపల్లిలో బుధవారం కార్యకర్తలు, అభిమానులు ఆనందంతో బాణసంచా కాల్చి ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. మాడుగుల నియోజకవర్గంలో అంచలంచెలుగా ఎదుగుతూ డిప్యూటీ సీఎం స్థాయి పదవులు నిర్వహించిన బూడి ముత్యాల నాయుడు అనకాపల్లి ఎంపీగా బరిలో దిగడం అభిమానులు, కార్యకర్తలలో ఎంతో ఉత్సాహాన్ని నింపిందని వారు పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుండి భరత్‌కుమార్‌ను ఎమ్మెల్యేగా, పార్లమెంట్ నియోజకవర్గం నుండి బూడి ముత్యాల నాయుడును ఎంపీగా గెలిపించుకుంటామని రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేటర్ నీలిమ భాస్కర్, నూకాంబిక ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

'బేటీ బచావో, బేటీ పఢావో'పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండల కేంద్రం కె.కోటపాడులో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో-బేటీ పఢావో (ఆడపిల్లలను బతికిద్దాం - ఆడపిల్లలను చదివిద్దాం)పై అంగన్వాడీ కార్యకర్తలు బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఓ మంగతాయారు మాట్లాడుతూ చిన్నారుల పరిరక్షణకు అధిక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి డి.లోవరాజు, సూపర్వైజర్లు సుశీల, కళ్యాణి, ఆదిలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాన్యులు- ధనవంతుల మధ్య పోటీ

ప్రజాశక్తి- కె.కోటపాడు

అనకాపల్లి పార్లమెంట్, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ సారి సామాన్యులకు, ధనవంతులకు మధ్య ఎన్నికల పోటీ జరుగుతుందని వైసిపి మాడుగుల నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ అభివర్ణించారు. మాడుగుల వైసిపి అభ్యర్థిగా ఆ పార్టీ అధిష్టానం అనురాధను ప్రకటించిన నేపథ్యంలో బుధవారం ఆమె కె.కోటపాడులో విలేకరులతో మాట్లాడారు. అనకాపల్లి పార్లమెంటుకు, మాడుగుల అసెంబ్లీకి జరుగుతున్న ఎన్నికలు లోకల్ - నాన్ లోకల్ మధ్య జరుగుతున్న పోరాటమన్నారు. టిడిపి, జనసేన బిజెపి కూటమికి అభ్యర్థుల దొరక్క అనకాపల్లి పార్లమెంటుకు కడప నుండి, మాడుగులకు ఎన్ఆర్ఐను దిగుమతి చేసుకున్నాయని ఎద్దేవా చేశారు. అనకాపల్లి జిల్లా, మాడుగుల నియోజకవర్గ ఓటర్లు స్థానికులకే పట్టం కడతారని ఆమె ఆశా భావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమం, మాడుగుల నియోజకవర్గంలో తన తండ్రి బూడి ముత్యాల నాయుడు చేసిన అభివృద్ధి తన గెలుపునకు దోహదపడతాయని చెప్పారు. అంతకు ముందు అనురాధను ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, శివాజీ రాజు శాలువతో సత్కరించారు. ఈ సమావేశంలో అధిక సంఖ్యలో ఎంపీటీసీలు, సర్పంచులు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలోని నక్కపల్లి పోలీస్ స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల మృతి చెందిన డి.దుర్గాభవాని తల్లి చందక రాధకు విడో ఫండ్ నుండి రూ.50వేలు చెక్కును జిల్లా ఎస్పీ ఏవి మురళీకృష్ణ బుధవారం ఎస్పీ కార్యాలయంలో అందజేశారు. డి.దుర్గా భవానికి 9వ తరగతి చదువుతున్న నాగ శాంతి, 6వ తరగతి చదువుతున్న హేమంత్ ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో పని చేస్తూ మృతి చెందిన దుర్గా భవాని కుటుంబానికి సంతాపాన్ని తెలియజేశారు. పిల్లలు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లల్ని బాగా చదివించాలని, ధైర్యంగా ఉండాలని, పోలీసు శాఖ తరఫున సహాయ సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఏఓ బి.శారద, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సతీష్, కార్యాలయ సిబ్బంది నిర్మల కుమారి, వరలక్ష్మి పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్పి మురళీకృష్ణ

పనులు కల్పించాలని బిల్డింగ్ వర్కర్ల ధర్నా

భవన నిర్మాణ పనులకు ఇసుక మంజూరు డిమాండ్

ప్రజాశక్తి-దేవరాపల్లి

బిల్డింగ్ వర్కులకు ఇసుక మంజూరు చేసి, భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించాలని కోరుతూ మండలంలోని భవన నిర్మాణ కార్మికులు బుధవారం స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. 'తిండైనా పెట్టండి.. పనులైనా చూపండి' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో రీసర్వే డిప్యూటీ తహశీల్దారుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికులు మాట్లాడుతూ దేవరాపల్లి మండల కేంద్రంలో సుమారు 500 మంది బిల్డింగ్ వర్కర్లుగా, మరో 500 మందికి పైబడి కూలీలుగానూ జీవిస్తున్నారని తెలిపారు. భవన నిర్మాణ పనులకు ఇసుక అందకపోవడంతో ఎక్కడికక్కడ పనులు నిలిచిపోయాయని తెలిపారు. దీని వలన భవన నిర్మాణ కార్మికులకు పనుల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇసుకకు అనుమతులు ఇవ్వకపోవడంతో ఇసుక తేలేకపోతున్నామని టైర్ బండ్ల యాజమానులు చెబుతున్నారన్నారు. విచ్చల విడిగా ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుక రవాణా జరిగినంతా కాలం అధికారులు పట్టించుకోలేదని, ఇప్పుడు కుంటి సాకులు చెప్పి, ఎడ్ల బండులను సైతం పూర్తిగా నిలుపుదల చేసి, ర్యాంపులు దగ్గర ట్రెంచల్ కొట్టేసి బండ్లు వెళ్ళకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. ఇసుక రవాణా పూర్తిగా నిలిచిపోవడంతో పనుల్లేక దాదాపుగా వెయ్యి కుటుంబాలు పస్తుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సహృదయంతో అర్థం చేసుకొని టైర్ బండ్లుతో ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వాలని, ఆ ఇసుకను మండలంలోని భవన నిర్మాణాలకు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వీరి ఆందోళనకు సిఐటియు జిల్లా నాయకులు డి.వెంకన్న మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు నమ్మి నాగరాజు, గొర్లె దేముళ్ళు, నమ్మి దేముళ్ళు, సబ్బవరపు మాలిబాబు, చిన్నబాబు, మన్నేల గోవిందు, కె.అప్పారావు, అధిక సంఖ్యలో బిల్డింగ్ వర్కర్లు పాల్గొన్నారు.



తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియలో మార్పులు

డిఆర్ఓ దయానిధి



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఓ దయానిధి

ప్రజాశక్తి- అనకాపల్లి

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో పోస్టల్ బ్యాలెట్ వినియోగంలో ఎన్నికల కమిషన్ నిబంధనలను మార్పు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి తెలిపారు. కలెక్టరు కార్యాలయంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో వెలువడిన అభ్యంతరాలను పరిశీలనలో తీసుకుని కొన్ని మార్పులు చేసినట్లు చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ఓటరు వెంట తీసుకు వెళ్లకుండా వెంటనే వినియోగించే విధంగా ఎన్నికల కమిషన్ నిబంధనలను రూపొందించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా ఓటర్లకు తెలియజేసి దానిపై అవగాహన కల్పించాలని సూచించారు. గతంలో మాదిరి పోస్టుద్వారా ఓటరుకు పంపించడం జరగదన్నారు. పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి కెఎస్.కుమార్ మాట్లాడుతూ వివిధ రకాల పోస్టల్, హెూమ్ ఓటింగ్‌ల గూర్చి వివరించారు. సర్వీసు ఓటర్లు, ప్రత్యేక ఓటర్లు, ఎలక్షన్ విధులలో వున్న వారు వివిధ రకాలుగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. 85 సంవత్సరాలు వయసు పైబడి అనారోగ్యంతో వున్నవారికి, 40 శాతం కన్నా ఎక్కువ అంగవైకల్యం కలిగిన వారికి ముందుగా వారి అభ్యర్థన మేరకు పోలింగ్ అధికారి వారి ఇంటి వద్దకు వెళ్లి ఓటు వేయించుకుంటారని చెప్పారు. అయితే ఒకసారి హెూమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నట్లయితే ఆ విధానం ద్వారానే ఓటు హక్కు వినియోగించుకోవలసి వుంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని గూర్చి అందరికీ తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు (తెలుగుదేశం), కె.హరనాధబాబు (ఆమ్ ఆద్మీ), పి.నాగేశ్వరరావు (బి.జె.పి), ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ డి.రామ్మూర్తి, డిటి రవికుమార్, ఎస్ఏ తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన తీర్థం పుచ్చుకున్న పిన్నమరాజు



పంచకర్ల సమక్షంలో జనసేనలో చేరిన పిన్నమరాజు

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని ఆరిపాక పంచాయితీకి చెందిన వైసీపీ మండల సమన్వయ కమిటీ సభ్యులు పిన్నమరాజు సత్యనారాయణ రాజు బుధవారం జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు సుజాతనగర్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో పెందుర్తి నియోజకవర్గం ఎన్డీయే అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు సమక్షంలో సత్యనారాయణరాజు జనసేన పార్టీలో చేరారు. రమేష్‌బాబు జనసేన కండువా కప్పి సత్యనారాయణ రాజును పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వి.రామకృష్ణ, డి.కృష్ణ చైతన్య, ఎలమంచిలి మారయ్య, పి.అప్పారావు, పిఎం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎంపిటిసి రాజానా జనసేనలో చేరిక

అచ్యుతాపురం : అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన చిప్పాడ ఎంపీటీసీ సభ్యుడు రాజాన పైడియ్యానాయుడు (బాషా), వైసిపి నాయకులు కూండ్రపు రమణ త్రివేణి దంపతులు ఆ పార్టీకి రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరారు. వారికి యలమంచిలి నియోజకవర్గం టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ జనసేన కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన అచ్యుతాపురం మండల శాఖ అధ్యక్షుడు బి రాందాసు, డి బాబ్జి, లాలం చందు, ఎం.శ్రీవేణి తదితరులు పాల్గొన్నారు.

1500 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : మండలంలోని గంటికొర్లం కుప్పకొండ ప్రాంతంలో నాటు సారా తయారు చేయడానికి సిద్ధంగా ఉంచిన 1500 లీటర్ల బెల్లం పులుపును, నాటు సారా తయారీకి ఉపయోగించే పరికరాలను బుధవారం పోలీసులు ధ్వంసం చేశారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసినట్లు బుచ్చయ్యపేట ఎస్సై డి ఈశ్వరరావు తెలిపారు.



అచ్యుతాపురంలో రక్తదానం చేస్తున్న జనసేన పార్టీ కార్యకర్తలు

ఘనంగా రామ్ చరణ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రముఖ సినీ నటులు రామ్ చరణ్ జన్మదినం వేడుకలు బుధవారం అనకాపల్లిలో మెగా ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రముఖ సినీనటులు పృథ్వీరాజ్ చేతుల మీదుగా గర్భిణులకు పండ్లు, రొట్టెల పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనకాపల్లి రామ్ చరణ్ ఫ్యాన్స్ ప్రెసిడెంట్ మళ్ల శ్రీను, ఉత్తరాంధ్ర చిరంజీవి యువత అధ్యక్షులు గల్లా కొండలరావు, కొణతల శ్రీను, కొమ్మోజు రాజు, తాడి రామకృష్ణ, బర్నికాన రాము, అప్పికొండ గణేష్, పీజే పవన్, లక్ష్మణ్, ప్రశాంత్, అజయ్, సాయి, వరాహాలరాజు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : రామ్ చరణ్ జన్మదిన వేడుకలు అఖిలభారత రామ్ చరణ్ ఫ్యాన్స్ అధ్యక్షులు, జనసేన పార్టీ నాయకులు లాలం చందు ఆధ్వర్యంలో బుధవారం ప్రశాంతి పాలిటెక్నిక్ కాలేజీలో ఘనంగా నిర్వహించారు. ఎలమంచిలి నియోజకవర్గ జనసేన పార్టీ అభ్యర్థి సుందరపు విజయకుమార్ చేతుల మీదుగా కేక్ కట్ చేశారు. అనంతరం రెడ్ క్రాస్ వారి సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు బయలుపూడి శ్రీరామదాసు, ప్రధాన కార్యదర్శి కొక్కిరగేడ్డ పవన్ విజయ్, డ్రీమ్స్ నాయుడు, జిల్లా సంయుక్త కార్యదర్శి చొప్పా శ్రీను, రుత్తల శ్రీను, రుత్తల కనకారావు, లాలం తాతారావు, ప్రగడ చిన నాగేశ్వరరావు, పైలా భాను ప్రసాద్, బొండల శ్యామ్, ఇతర నాయకులు పాల్గొన్నారు

వలస కార్మికులకు వైద్య సేవలు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

బుచ్చయ్యపేట మండలం, రాజాం గ్రామ సచివాలయ పరిధిలోని నీలకంఠాపురం గ్రామ శివారులో ఇటుక బట్టీల్లో పని చేస్తున్న ఒడిశా ప్రాంతానికి చెందిన వలస కార్మికులకు బుధవారం వైద్య సేవలు అందించారు. ఇక్కడున్న గర్భిణులు, బాలింతలకు తురకలపూడి పీహెచ్‌సీ వైద్యాధికారుల ఆదేశాలతో రాజాం సచివాలయ ఏఎన్ఎం సిబ్బంది షుగర్, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కె.నాయుడుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

వరి సాగులో

విత్తన మార్పిడిపై అవగాహన కల్పించాలి

- జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు

ప్రజాశక్తి -నక్కపల్లి:వరి సాగులో విత్తన మార్పిడి పై రైతులకు అవగాహన కల్పించి ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు సూచించారు. మండలంలోని ఉద్దండపురం రైతు భరోసా కేంద్రంలో బుధవారం పాయకరావుపేట సబ్ డివిజన్ పరిధిలో 5 మండలాలకు సంబంధించి వ్యవసాయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సబ్ డివిజన్ పరిధిలో సుమారుగా 37500 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారన్నారు. రైతాంగం ఆనాటి నుండి నేటి వరకు పాత రకాలైన వరి విత్తనాలను మాత్రమే సాగు చేస్తున్నారని, రైతులకు కొత్త రకాలైన విత్తనాలపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆర్ జి ఎల్ 2537 బదులుగా ఎంటియు 1262 మార్టూరు సాంబ, ఎంటియు 1061 ఇంద్ర, ఎంటియు 1064 అమర రకాలను, బిపి టి 5204 సాంబ మసురికి బదులుగా మార్టెరు సాంబ కొత్త రకాలను రైతులు వరి సాగు చేయడంతో తెగుళ్ళ, చీడలను తట్టుకోవడంతో పాటు ఎక్కువ దిగుబడి వస్తుందన్నారు. రైతులు కొత్త రకాలను వాడే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. కొత్త రకాలతో కలుగు లాభాలను రైతులకు తెలియజేయాలన్నారు. ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఎరువుల యాజమాన్యంలో నానో యూరియా, నానో డి ఏపిలను పంటల సిఫార్సు బట్టి రైతులు వాడేలా ప్రోత్సహించాలన్నారు. రానున్న ఖరీఫ్ సీజన్‌కు సూక్ష్మ ప్రణాళికతో సన్నద్ధతగా వుండాలన్నారు. ఈ సమావేశంలో ఎలమంచిలి వ్యవసాయ సహాయ సంచాలకులు రవి ప్రకాష్, వ్యవసాయ అధికారులు సౌజన్య, ఉమా ప్రసాద్, ఆదినారాయణ, మోహన్, ఏ ఈఓలు సత్యనారాయణ, నాయుడు, బాబాజీ, వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోహన్ రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

రాజకీయాలకతీతంగా పథకాలు

-ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:సంక్షేమం, అభివృద్ధి కోసం వైసిపిని గెలిపించాలని నర్సీపట్నం నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కోరారు. బుధవారం మండలంలోని అమలాపురం గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ, గడిచిన ఎన్నికల్లో వైసీపీ ప్రకటించిన మేనిఫెస్టోను నూటికి 99 శాతం అమలు చేశామని చెప్పారు. 2014లో టీడీపీ 600 హామీలు ఇచ్చి కనీసం 60 కూడా నెరవేర్చలేదని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల కాలంలో ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. మళ్లీ సంక్షేమం, అభివృద్ధి కోసం వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, మండల పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, అమలాపురం సర్పంచ్ శెట్టి శ్రీను, వేములపూడి ఎంపిటిసి బోళెం వెంకటేష్, గురందొరపాలెం సర్పంచ్ చినబాబు, ధర్మసాగరం సర్పంచ్ కన్నయ్యనాయుడు, ఒఎల్ పురం సర్పంచ్ బంటు నాగేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఇష్టానుసారంగా మాట్లాడితే సహించం'

ప్రజాశక్తి -నక్కపల్లి:జనసేన పార్టీని వీడిని వారు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ హితవుపలికారు. నక్కపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, శేషుకుమారి, సరోజ, లక్ష్మి శివకుమారి జనసేన పార్టీని వీడి ఖైదీలపార్టీలో చేరి శ్రీరంగ నీతులు చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ,పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్‌లపై ఏది పడితే అది ఇష్టానుసారంగా మాట్లాడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా పార్టీ కార్యదర్శి ఆకేటి గోవిందరావు, నాయకులు పాము గణేష్, చంద్రరావు, జోగారావు, జువ్విన బద్రి, మెరుగు మహేష్, గోవిందు, ఆనంద్ కుమార్, సిహెచ్ రాము, చిన్నా, రాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కండువా వేస్తున్న బూడి

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ముషిడిపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఉపసర్పంచ్ మతల సూరిబాబు బుధవారం వైసీపీలో చేరారు. సూరిబాబుకు మండలంలోని తారువ గ్రామంలో ఉపముఖ్యమంత్రి, వైసిపి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు వైసిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ముషిడిపల్లి సర్పంచ్ మతల మధు సూర్యరావు, ఎంపీటీసీ బొడ్డు అప్పారావు, వైసిపి మండల అధ్యక్షులు బూరె బాబురావు పాల్గొన్నారు.

అనకాపల్లిడెస్క్:నాతవరం మండలం డి.ఎర్రవరం గ్రామంలోని టీడీపీకి చెందిన పలువురు బుధవారం వైసీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మాట్లాడుతూ, వైసీపీ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని అంతకాపల్లి పంచాయతీ పరిధిలోని జనసేన పార్టీ కార్యకర్తలు బుధవారం వైసీపీలో చేరారు. యువ నాయకులు లాలం అచ్చంనాయుడు, అలీ ఆధ్వర్యంలో వైసిపిలో చేరిన జనసేన కార్యకర్తలు కిరణ్, హేమంత్, దినేష్, ప్రణీత్ తదితరులకు స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ పార్టీ కండువాలు వేసి వైసిపికిలో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, వైస్ ఎంపీపీ గోవింద్, వైసీపీ నాయకులు బైలపూడి భగవాన్, సర్పంచ్ సబ్బవరపు నారాయణ మూర్తి, మాజీ సర్పంచ్ దేముడు బాబు, ఉప సర్పంచ్ గొర్లి అప్పారావు, జగదీష్, కోటిబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపమాకలో పందిరి రాటోత్సవం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉపమాక మెరకవీధి రామాలయం వద్ద బుధవారం ఉదయం గ్రామ పెద్దలు చేతుల మీదుగా ఏప్రిల్ 17వ తేదీన శ్రీరామనవమి వేడుక సందర్భంగా రాములోరి పందిరి పందిరి రాటోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో పందిరి రాట వేశారు. ఈ సందర్భంగా సప్తాహం కార్యక్రమం నిర్వహించనట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఏప్రిల్ 10వ తేదీ ఉదయం 6 గంటల నుండి 17వ తేదీ ఉదయం 6 గంటల వరకు గ్రామ ప్రజల సహకారంతో, శ్రీనివాస భజన భక్త సమాజం ఆధ్వర్యంలో సప్తాహం (7 రోజులపాటు భజన కార్యక్రమం) నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు.ఏప్రిల్ 17న సీతారాముల కళ్యాణ మహొత్సవం ను వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కొప్పిశెట్టి కొండబాబు, కృష్ణ, సిహెచ్ వెంకటేశ్వరరావు, కొప్పిశెట్టి బుజ్జి, హరిబాబు, ప్రగడ వీరబాబు, ఈశ్వరరావు, హరి, రవి, టి.అప్పారావు పాల్గొన్నారు.



పందిరి రాట వేస్తున్న గ్రామ పెద్దలు



చెక్క సామగ్రిని ఇస్తున్న కార్పెంటర్లు

కార్పెంటర్స్ డే వేడుకలు

పలు సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:గొలుగొండ మండలం మేజర్ పంచాయతీ ఏఎల్ పురం గ్రామంలో బుధవారం కార్పెంటర్స్ డే సందర్భంగా బుధవారం కార్పెంటర్స్ కేక్ కట్ చేశారు. సీనియర్ కార్పెంటర్స్ కి సన్మానం చేసారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గవర్నమెంట్ హాస్పిటల్‌లో చిన్న చిన్న రిపేర్ పనులు చేసి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి డాక్టర్లు హరి ప్రవీణ్, గాయత్రి, సావిత్రి మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం కార్పెంటర్స్ ఎంతో సేవా దృక్పథంతో హాస్పిటల్లో బెంచీలు, తలుపులు రిపేర్ పనులు చేస్తూ రోగులకు పండ్లు పంపిణీ చేయడం చాలా సంతోషమన్నారు.ఈ కార్యక్రమంలో గొలుగొండ మండలంలోని కార్పెంటర్స్ పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న పోలీసులు

పలు షాపుల్లో తనిఖీలు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:అనకాపల్లి స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో అడిషనల్ సూపరిండెంటెంట్ ఆదేశాల మేరకు గొలుగొండ ఎస్ఈబి ఎస్సై రహీం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో పాన్, కిరాణా షాపులు, టిఫెన్ హోటళ్లను తనిఖీ చేశారు. సదరు షాపుల్లో ఎటువంటి మద్యం విక్రయాలు, నిల్వాలు లేవని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఎస్ఈబి సిబ్బంది పాల్గొన్నారు.

భూ సర్వే రాళ్లు దుర్వినియోగం

- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

ప్రజాశక్తి -కోటవురట్ల:రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూ సర్వే నిమిత్తం ఏర్పాటు చేసిన సర్వే రాళ్లు దుర్వినియోగం అవుతున్నాయి. అయినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు, మండల కేంద్రంలో సర్వే రాళ్లు ప్లాంటేషన్ నిమిత్తం మండల పరిషత్ ఆవరణలో ఉంచారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో స్టోన్ ప్లాంటేషన్ పనులు నిలిచిపోయాయి. ఈ సర్వే రాళ్లను వివిధ రకాలుగా దుర్వినియోగం చేయడం విశేషం. ఒక్కో సర్వే రాయి దాదాపు 500 రూపాయలు ఉంటుంది. ఈ రాళ్ళను వివిధ రకాలుగా వినియోగించు కుంటున్నారు. ఇటీవల మండల పరిషత్ ఆవరణలో చేపట్టిన సిమెంటు పలకల ఏర్పాటుకు, రోడ్డు నిర్మాణానికి ఈ రాళ్లను ఏర్పాటు చేయడం గమనార్హం. అదేవిధంగా పౌరసరఫరాల గిడ్డంగి వద్ద మెట్లు నిర్మాణానికి ఈ సర్వే రాళ్లను వినియోగించడం విశేషం. ఈ రాళ్లపై ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ పేర్లను తొలగించలేదు.అధికారులు స్పందించి సర్వే రాళ్లను పరిరక్షించాలని పలువురు కోరుతున్నారు.



సిమెంట్ పలకల మధ్య సర్వే రాళ్లు



గిడ్డంగి వద్ద సర్వే రాళ్లతో ఏర్పాటు చేసిన మెట్లు



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎంవివి సత్యనారాయణ

18వ వార్డులో ఎంవివి పాదయాత్ర

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జివిఎంసి 18వ వార్డు పరిధి సెక్టార్-6లో తూర్పు నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి.సత్యనారాయణ బుధవారం 73వ రోజు పాదయాత్ర చేశారు. గడపగడపకూ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులకు సంక్షేమ పథకాలు అందించడం, పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చడం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే సొంతమన్నారు. రానున్న ఎన్నికలలో జగన్మోహన్‌రెడ్డి గెలుపుతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందన్నారు. గత ఐదేళ్లలో పేదల సంక్షేమానికి అందించిన సేవలే నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ అనుబంధ సంఘాల నాయకులు, మహిళలు, పార్టీ శ్రేణులు, అభిమానులు, పలు కార్పోరేషన్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న వంశీకృష్ణ శ్రీనివాస్

'దక్షిణం'లో వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రచారం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ బుధవారం 32వ వార్డు గోకుల్ థియేటర్ ప్రాంతం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. టిడిపి విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు గండి బాబ్జి సమక్షంలో ఎవిఎన్ కళాశాల వద్ద ప్రచారాన్ని ప్రారంభించారు. 36వ వార్డులోని సున్నపు వీధి ముస్లిం నివాస ప్రాంతాలలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలనడిగి తెలుసుకున్నారు. వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



ఇన్ఫోసిస్ ప్రతినిధులను సత్కరిస్తున్న విసి

ఎయును సందర్శించిన ఇన్ఫోసిస్ ప్రతినిధులు

ప్రజాశక్తి-ఎంవిపికాలనీ: ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని ఇన్ఫోసిస్ విశాఖ కేంద్రం ప్రతినిధులు బుధవారం సందర్శించారు. ఇన్ఫోసిస్ విశాఖపట్నం డెలివరి సెంటర్ హెడ్ ఎన్.సురేష్, ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డితో సమావేశమై వివిధ అంశాలపై ప్రాథమికంగా చర్చించారు. కార్యక్రమంలో ఎయు ఇంజనీరింగ్ కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి మూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎయు తరపున ఇన్ఫోసిస్ హెడ్ ఎన్.సురేష్‌ని సత్కరించి, జ్ఞాపిక బహూకరించారు. అనంతరం ఇన్ఫోసిస్ ప్రతినిధులు ఎయు ఇంక్యుబేషన్ సెంటర్‌ను ప్రత్యక్షంగా పరిశీలించి, అక్కడ పనిచేస్తున్న సంస్థలు, విధానాన్ని ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.

స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ బడ్జెట్‌కు

మహాజన సభ ఆమోదం

ప్రజశక్తి-ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ 59వ మహాజనసభ బుధవారం స్టీల్‌క్లబ్ ఆడిటోరియంలో జరిగింది. సొసైటీ ఉపాధ్యక్షుడు కె.ఆనంద్‌కుమార్ అధ్యక్షతన జరిగిన మహాసభలో ముందుగా మరణించిన సభ్యులకు ఎంవి.రమణ సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం కార్యక్రమంలో కార్యదర్శి శ్రీరామచంద్రమూర్తి నివేదికను మహాజన సభలో ప్రవేశపెట్టారు. 2024-25 బడ్జెట్‌ను డివిఎస్ఎన్ కొండరాజుప్రవేశపెట్టగా, మహాజనసభ ఆమోదించింది. ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ 37ఏళ్లుగా ఎటువంటి అవకతవకలకు అవకాశం లేకుండా, సభ్యులకు మెరుగైన సేవలు అందిస్తూ సంఘం ప్రగతి పథంలో సాగుతోందన్నారు. 12,933 మంది సభ్యులతో రూ. 361 కోట్ల టర్నోవర్‌తో పనిచేస్తోందన్నారు. ప్రతి సంవత్సరం ఆడి వర్గీకరణలో ఏ గ్రేడ్ సొసైటీగా నిలిచిందన్నారు.కార్యక్రమంలో డైరెక్టర్ కర్రి శ్రీనివాస్. మహీధర్ వివిధ కార్మిక సంఘాల నాయకులు, పాలకవర్గ మాజీ సభ్యులు, సీనియర్ మేనేజర్ దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.



మహాజనసభలో మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు ఆనంద్ కుమార్

ప్రశాంతంగా ముగిసిన టెన్త్ పరీక్షలు



దేవరాపల్లిలో కేంద్రానికి వెళుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి- నక్కపల్లి: ఈనెల 18 వ తేదీ నుండి నుండి ప్రారంభమైన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు బుధవారం తో ప్రశాంతంగా ముగిశాయని ఎంఈఓ కె.నరేష్ అన్నారు. మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఆయా కేంద్రాలకు ఛీఫ్ సూపరింటెండెంట్‌లుగా అప్పలరాజు, కె.ఎస్.ఆర్ .కుమారి, బి.సత్యారావు, రామప్రతాపరావు, రాణిలలిత , సత్తిబాబు తదితరులు ప్రశాంతంగా నిర్వహించినట్లు ఎంఈఓ తెలిపారు.

కొత్తకోట: రావికమతం మండలం కొత్తకోట, రావికమతం మెయిన్, దొండపూడి, మరుపాక ఏపీ మోడల్ స్కూల్, రావికమతం బాలికల హైస్కూల్లో పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతం గా ముగిసాయి.రెగ్యులర్ విద్యార్థులు 911మందితో పాటు మరో 29మంది ప్రైవేటు విద్యార్థులు కలిపి 940 మంది పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ ఆమలు చేసారు. చివరి రోజు విద్యార్థులు పరీక్ష వాసి ఆనందంతో కేరింతలు కొడుతూ ఉత్సాహంగా బయటకు వచ్చారు.

అనకాపల్లిడెస్క్: నర్సీపట్నం మండలం వేములపూడి జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని అనకాపల్లి జిల్లా అదనపు ఎస్పీ పి.సత్యనారాయణ బుధవారం పర్యవేక్షించారు. బందోబస్తు ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదనపు ఎస్పీ వెంట నర్సీపట్నం రూరల్ సీఐ బి.హరి ఉన్నారు.

దేవరాపల్లి: ఈ నెల 18న ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు దేవరాపల్లి మండలంలో బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని దేవరాపల్లి, తెనుగుపూడి పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. పరీక్షల్లో ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పోలీస్ అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఈ రెండు పరీక్ష కేంద్రాలలో 433 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. చివరి పరీక్ష రాసిన విద్యార్థులు ఆనందంతో ఇళ్లకు చేరుకున్నారు. మండల విద్యాశాఖ అధికారులు బి. పడాల్ దాస్, ఉషారాణి పర్యవేక్షణలో ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.



నర్సీపట్నంలో కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎఎస్‌పి

మనుషుల్లో మానవతా దృక్పథం నెలకొల్పాలి

-ఎయులో ధార్మిక విజ్ఞాన పరిణామంపై జాతీయ సదస్సులో ఆచార్య రెమిరజని

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : మానవ సమాజంలో మత విశ్వాసాలకంటే మానవతా దృక్పథం నెలకొల్పాలిన ఆవశ్యకత ఎంతైనా ఉందని శ్రీకాకుళం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కాళంగి రెమిరజిని అన్నారు. బుధవారం ఎయులో ఫిలాసఫీ అండ్ రెలీజియస్ స్టడీస్ విభాగం, ఎసిటిఎస్ సంయుక్త నిర్వహణలో "ధార్మిక విజ్ఞాన పరిణామం: ప్రాచీన సంప్రదాయాలపై ఆధునిక దృక్పథాలు' అంశంపై జాతీయసదస్సు నిర్వహించారు ఫిలాసఫీ శాఖాధిపతి ఆచార్య వానపల్లి వెంకట్రావు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో కీలకోపన్యాసం చేసిన ఆచార్య రెమిరజని మాట్లాడుతూ, మనిషి మనిషి మధ్య మతం అడ్డుగోడగా ఉందన్నారు. ప్రవర్తనను సరైన మార్గంలోకి నడిపించాల్సిన మతసారాన్ని తెలుసుకోకుండా, మనిషి స్వార్ధంతో మతఘర్షణలకు పాల్పడుతూ సమాజాన్ని మనశ్శాంతి లేకుండా చేస్తున్నాడని, దీనిని అందరూ ముక్తి కంఠంతో ఖండించాలన్నారు.

.ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ తల్లిదండ్రులను గురువులను పెద్దలను గౌరవించే సంప్రదాయాలు అంతరించి పోతున్నాయని ఆవేదన చెందారు. బెంగుళూర్ ఏసిటియస్ అకాడమీ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ సిఇఒ సంతోష్ నకణ్ మాట్లాడుతూ, ఎయుతో ఎసిటిఎస్ అవగాహనా ఒప్పందం కుదుర్చుకోవటం ఆనందంగా ఉందని, దీని ద్వారా విద్యార్థులలో పరిశోధనా సామర్థ్యం పెంపొందుతుందన్నారు.ఎయు రిజిస్ట్రార్ ఆచార్య యం జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలు విస్తృతమై, ప్రపంచమే కుగ్రామంగా మారిన నేటి పరిస్థితుల్లో మానవతా విలువలు లోపించడం బాధాకరమన్నారు. ధార్మిక జీవన విధానం తో మనుస్యుల మధ్య పెరుగుతున్న అంతరాన్ని తొలగించుకునే అవకాశం ఉందన్నారు.కార్యక్రమంలో బోర్డు అఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ బూసి వెంకటస్వామి, ఉత్కల్ యూనివర్సిటీ ఆచార్య నందిని మిశ్రా, విక్రమ్ దేవ్ యూనివర్సిటీ జైపూర్ ఆచార్య లక్ష్మణ్ పాత్రో, రమాదేవి, కటక్ మహిళా యూనివర్సిటీ నుంచి కళ్యాణి సారంగి, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ నుండి ఆచార్య పి రామకృష్ణ చౌదరి, విజయనగరం మహారాజ కళాశాల తత్త్వశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జి మాధవరావు ,చరిత్ర విభాగాధిపతి జె వి రమణ, డాక్టర్ ముసుగు ప్రసాద్, డాక్టర్ ద్రాక్షాయణి, డాక్టర్ కల్యాణి, రాజధమ్మా పాల్గొన్నారు



మాట్లాడుతున్న శ్రీకాకుళం అంబేద్కర్ వర్సిటీ విసి రెమిరజని



జిప్‌లైన్‌ను పరిశీలిస్తున్న తిరునాథరావు

జిప్‌లైన్ ఏర్పాటుపై ఆరా

ప్రజాశక్తి -అనంతగిరి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహల వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా గిరిజనేత్రుడు జిప్‌లైన్‌ను నిర్మించారనే ఫిర్యాదు మేరకు లీగల్ అడ్వైజర్ ట్రైబల్ వెల్ఫేర్ కమిషన్ పి.తిరునాథరావు పరిశీలించారు. బుధవారం సందర్శించిన ఆయన ఈ జిప్‌లైన్ నిర్మాణంపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో హక్కులు, చట్టాలకు అనుగుణంగా గిరిజనేతరులు ఆక్రమణలకు పాల్పడటం చట్ట విరుద్ధమన్నారు. దీనిపై ఎస్టి కమిషన్ నుండి తమకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందిందని తెలిపారు. బొర్రా లో పనిచేస్తున్న కార్మికులు పలు సమస్యలపై విన్నవించారు. కనీస వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, 2018లో ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం హామీలు పరిష్కారం చేయలేదని విన్నవించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్. నాగజ్యోతి, ఇన్‌చార్జి ఎంపీడీవో నగేష్ పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా జరిగేందుకు చర్యలు

ప్రజాశక్తి-పాడేరు: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయ సునీత స్పష్టం చేసారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను, కౌంటింగ్ కేంద్రాలను అరకు, పాడేరు రిటర్నింగ్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎటువంటి అపోహలకు తావు లేకుండా అన్ని భద్రతా పరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటింగ్ ముందు రోజు ఎన్నికల సామగ్రి పంపిణీ చేయాల్సిన విధానం, కౌంటింగ్ ఏర్పాట్లపై పలు సూచనలు తెలియజేశారు. ఈ పరిశీలనలో పాడేరు రిటర్నింగ్ అధికారి, జేసి భావన వశిస్ట్, అరకు రిటర్నింగ్ అధికారి, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.అంబేద్కర్, గిరిజన సంక్షేమ ఇఇ డివిఆర్ఎం రాజు, తహసిల్దార్ కళ్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.